


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 226 | శుక్రవారం 21 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3


**టీటీడీ నెయ్యి వివాదం.. సజ్జల రామకృష్ణారెడ్డిపై సంగం డెయిరీ పరువునష్టం దావా**



# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

**ఆర్థిక శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది**

**దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం ముఖ్యం**

**సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు**

2లో

**అభివృద్ధికి బాబు బ్లూప్రింట్**

వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. కేంద్ర - రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ఏపీ సీఎం సూచించారు. గురువారం తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని తెలిపారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని ఆయన గుర్తు చేశారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10 సంస్థలు.. 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదన్నారు. విభజన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఆయన ప్రతిపాదించారు. కుప్పం మీదుగా బు÷-లలెట్ ట్రైన్ నడపాలని పేర్కొన్నారు. రాజధాని అమరావతి - బెంగళూరు - చెన్నై నగరాలను అనుసంధానించేలా ఈ రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్,

# రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

2లో

**వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం**

**ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోదీ**





భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు.

## విద్యాహక్కు చట్టం కింద లక్ష దాటిన ప్రవేశాలు..



ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలు బాగా పెరిగాయన్న మంత్రి

2022-26 మధ్య ప్రైవేట్ పాఠశాలల్లో 1,04,046 మందికి అవకాశం

2లో

2022-23లో కేవలం 2,203గా ఉన్న ప్రవేశాలు, 2024-25లో 29 వేలకు చేరిక

ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నామని వెల్లడి

ఆర్టీఈపై విస్తృత ప్రచారం, అవగాహన కల్పించడమే ఇందుకు కారణమని వివరణ

# స్థానిక పోరుకు జనసేన సై..

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని జనసేనకు పవన్ పిలుపు**

**విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్లతో ప్రత్యేక కమిటీ**

**సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా స్థానికాల్లో మెరుగైన స్థాయిలో పోటీ**

**గత ప్రభుత్వ హయాంలో పోరాడిన శ్రేణుల స్ఫూర్తిని గౌరవిస్తామని హామీ**

**కొన్నిచోట్ల కూటమి ధర్మం పాటించడం లేదని ఎమ్మెల్యేల ప్రస్తావన**

2లో



రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికలే లక్ష్యంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన వ్యూహానికి భిన్నంగా, క్షేత్రస్థాయి బలాబలాలకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో జనసేన ప్రభావశీలమైన పోటీ ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనకు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం శాసనసభ ప్రాంగణంలోని

## మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..



కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన ఎస్‌వోపీ అమలు చేయాలని అధికారులకు ఆదేశం

మత్స్యకారుడు అప్పన్న కోసం గాలింపు ముమ్మరం చేయాలన్న హోంమంత్రి అనిత

కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విస్తృత గాలింపు చర్యలు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ భరోసా

2లో

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాల్సిందే: జగన్



డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయన్న జగన్

2లో

ప్రశ్నాపత్రం తయారీ, పరీక్షల నిర్వహణ రెండూ ఒకే అధికారి చేతిలో పెట్టారని విమర్శ

తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని మండిపాటు

రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో స్పష్టమైన అక్రమాలు, అవకతవకలు జరిగిన ఆధారాలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఒప్పుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో

# 'స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు'..

# కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

**1937 నిర్ణయం దేశ విభజనకు బీజం వేసిందన్న అమిత్ షా**

**ఆ నిర్ణయంతో ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చిందని విమర్శ**

**బంకించంద్రుడి రచనను కాంగ్రెస్ అవమానిస్తోందని షా ఆరోపణ**

**పూర్తి వందేమాతరంతో దేశ ఐక్యత బలోపేతమవుతుందన్న షా**

**రాహుల్ నాయకత్వంలో బుజ్జగింపు రాజకీయాలు కొనసాగుతున్నాయని విమర్శ**

2లో



వందేమాతరం విషయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలనే పాడాలన్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది సాధారణ నిర్ణయం కాదని.. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను అవమానించడమేనని ఆరోపించారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని మళ్లీ అమలు చేయడం ద్వారా అప్పటి తప్పిదాన్ని పునరావృతం

## విశాఖ స్కూల్లో విద్యార్థి మృతి ఘటనపై స్పందించిన మంత్రి లోకేశ్



**విశాఖలో టీచర్ దెబ్బలకు బాలుడు మృతి చెందిన ఘటన**

**బాధ్యులు, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తప్పవని హామీ**

**మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని లోకేశ్ భరోసా**

2లో

విశాఖపట్నంలోని లిటిల్ గార్డెన్ ప్రైవేట్ పాఠశాలలో ఆరేళ్ల బాలుడు ప్రణయ్ తేజ్ మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటనకు బాధ్యులైన వారిపై, పాఠశాల యాజమాన్యంపై

# స్థానిక పోరుకు జనసేన సై..

తన కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభ పక్ష సమావేశంలో ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్నో దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా ధైర్యంగా నిలబడిన జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ విస్మరించబోమని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. “నామినేషన్ వేయలేని పరిస్థితులు సృష్టించినా, అప్పటి పాలకులను ఎదిరించి పోటీలో నిలిచిన మన శ్రేణుల త్యాగం విలువైనది. వారి స్ఫూర్తికి తగిన గౌరవం దక్కేలా ఈసారి జనసేన నిలబడుతుంది“ అని ఆయన పేర్కొన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అప్పటి దాష్టీక పాలనను అంతం చేయాలనే లక్ష్యంతోనే జనసేన కేవలం 21 స్థానాలకు పరిమితమై పోటీ చేసిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో ప్రాంతాలవారీగా రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు ఉంటాయని వివరించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో జనసేన బలాబలాలను అంచనా వేయాలని ఆదేశించారు. పోటీకి అనువైన స్థానాలను గుర్తించి, పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. రాబోయే ఎన్నికల కార్యాచరణ, విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు, కొన్ని నియోజకవర్గాల్లో మిత్రపక్షాల నేతల వైఖరి వల్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోందని, కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని, పార్టీ శ్రేణుల మనోభావాలను తప్పక గౌరవిస్తామని హామీ ఇచ్చారు. వారికి రాజకీయంగా అండగా నిలుస్తూ, మెరుగైన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సుదీర్ఘ సమావేశంలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్ సహా పలువురు జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..

బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానం (ూ్రా-ౄఖఅఝతీస ాజూవతీఫ్ఆఅస్త్ర ్రాతీశీఎవఎబతీవ) అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు పలు కీలక ప్రశ్నలను అధికారులపై సంధించారు. “బోటులో ట్రాన్స్‌పాండర్ ఏమైంది? ఆ బోటు ఒక్కటే ఎందుకు వేటకు వెళ్లింది? గల్లంతైనట్లు సమాచారం ఎప్పుడు అందింది? గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు?“ అంటూ లోతుగా ఆరా తీశారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ నెల 3వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. సాధారణంగా 10 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు విశాఖ లేదా పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు.ప్రస్తుతం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా వైఫల్యాలపై దృష్టి సారించాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారుల వివరాలు: కోపనాతి రామకృష్ణ (కొమరగిరిపట్నం), సంఘాని తాతారావు (బలుసుతిప్ప), పాలెపు శాంతారావు (ఓడలరేవు), ఏసుదాస్ (అడగట్లపాలెం), కొల్లాటి శ్రీనివాస్ (ఓడలరేవు), కాటాడి సతీశ్ (పశువులంక), కర్రి రాముడు (నక్క రామేశ్వరం). వీరి ఆచూకీ కోసం అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.

# ‘స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు’.. కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

చేస్తోందని విమర్శించారు. “1937లో ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ వందేమాతరాన్ని రెండు భాగాలుగా చేసింది. అదే దేశ విభజనకు బీజం వేసింది. అక్కడి నుంచి ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చింది. చివరకు దేశం విడిపోయి పాకిస్థాన్ ఏర్పడింది” అని షా ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేస్తోందని అన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని షా పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ బంకించంద్రుడి గొప్ప రచనను మాత్రమే కాదు.. “వందేమాతరం“ అంటూ ఉరికంబాలు ఎక్కిన లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులను కూడా అవమానిస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లు జైళ్లలో గడిపిన వీరుల త్యాగాలను కూడా విస్మరిస్తోందని అన్నారు. వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసిందని షా తెలిపారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు పూర్తి వందేమాతరాన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దీనికి అధికారిక మార్గదర్శకాలు కూడా జారీ చేశామని వెల్లడించారు.రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మాత్రం పార్లమెంట్ నిర్ణయాన్ని కాదని.. 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అమలు చేస్తోందని షా విమర్శించారు. కాంగ్రెస్ మళ్లీ బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దేశ ప్రజలు ఈ నిర్ణయాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్ల తర్వాత కూడా ఇలాంటి నిర్ణయాలను దేశ ప్రజలు సహించబోరని అన్నారు. కాగా, కాంగ్రెస్ మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించింది. 1937లో మహాత్మా గాంధీ, నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ తదితర అగ్రనేతలు ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాన్నే ఇప్పుడు పాటిస్తున్నామని కేసీ వేణుగోపాల్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలనే పాడతామని స్పష్టం చేశారు. వందేమాతరం, జాతీయ గీతం తమకు భావోద్వేగ అంశాలని.. బీజేపీ మాత్రం దీనిని రాజకీయ అంశంగా మార్చిందని విమర్శించారు.

# భారీగా పెరిగిన బంగారం ధరలు

అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు భారీ పెరుగుదల నమోదు చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మార్కెట్ అంచనాలు కూడా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.4300 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,46,000గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.3950 మేర పెరిగింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలోకు రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది.

# మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. మహిళ ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. రిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ధరలతో సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల కట్టడికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం తమ పరిధిలోలేదన్నరీతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సొంత ఎజెండాలను ముందుకేసుకుని నడుస్తున్నాయి. ప్రజలు ఏమయితేనేమీ అన్న భావనలో పాలకుల తీరు ఉంది. ఎన్నికలప్పుడు మేనేజ్ చేయడం నేర్చుకున్నవారు ఆ తరవాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎదుటి పార్టీలను బురిడీ కొట్టించడం, నానాయాగీ చేయడం తప్ప పాలన కట్టుతప్పి పోతోంది. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఫైన్ రైస్ కిలో బియ్యం ధర 80 రూపాయలకు చేరింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని, వందకు చేరుకుంటుందని అంటున్నారు. ఎల్‌నినోతో ఉత్పత్తి తగ్గిందన్న సాకుతో ధరలు పెంచేశారు. అలాగే ఉప్పులు పప్పులు, నూనెల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచేస్తున్నారు. ఇవన్నీ ఎవరి పరిధిలో ఉందో ప్రజలకు తెలియడం లేదు. ఇక కూరగాయల ధరలు కూడా 60 నుంచి వంద వరకు పలుకుతున్నాయి. అయితే ఎపిలో సబ్సిడీ బియ్యం పథకం ప్రారంభించారు. ఇది పెద్దగా ప్రజామోదం పొందలేదు. పాలకులు సొంత ఎజెండాతో, పార్టీ పరంగా విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉన్నారు. ఎపిలో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అన్న రీతిలో వైకాపా, టిడిపి కూటమి పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ నడుస్తున్నా అందులో ధరలపై ఎజెండా లేదు. తెలంగాణలో 22ఎ వ్యవహారం ముదిరింది. ప్రజలను రోడ్డుకీడ్చిన రేవంత్ సర్కార్ వారి నుంచి భూములను లాక్కునే ప్రయత్నంలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రులంతా వసూళ్లలో పడ్డారని, 30 శాతం కమిషన్ ప్రభుత్వం అని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. బిఆర్ఎస్‌ను విమర్శించడంలో కాంగ్రెస్ బిజీగా ఉంది. ఇక బిజెపి వందేమాతరం, డీలిమిటేషన్, కొత్త కార్యవర్గం కూర్పుతో బిజీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడం, యువతకు క్షమాపణలు చెప్పండి అన్న పనిలో పడింది. మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ సొంద ఎజెండాతో నడుస్తున్నాయి. అందువల్ల ధరల దాడి వాటికి పట్టడం లేదు. బిజెపి అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా ఈ వ్యవహారాలను చూడడం లేదు. పార్టీలో కొత్త కార్యవర్గం, రానున్న పలు రాష్ట్రాల ఎన్నికలతో తలమునకలుగా ఉంది. తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో మళ్లీ రామ్ మాధవ్‌కు చోటు కల్పించారు.దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్దాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా,14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి 'సంఘ్' వాసనలు ఉన్నాయని అంటున్నారు. ఎలాంటి సమాచారాన్ని అయినా సత్వరం ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం వంటివి జరిగాయి. ఒకప్పుడు వెంకయ్య, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర దిగ్గజ నేతలతో అలరారిన పార్టీ ఇప్పుడు పేలవంగా తయారవుతోంది. నితిన్ నబీ అధ్యక్షుడు అయ్యాక పార్టీ పెద్దగా ప్రభావశీలంగా కనిపించడం లేదు. గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి ఎప్పుడూ మోడీ ముందుంటారు. అయితే అందులో ధరలు తగ్గించగలిగామని ఎప్పుడూ చెప్పలేదు. ధరలపై సమీక్షకు పెద్దగా సమయం కేటాయించ లేదు. తాజాగా ఇప్పుడు దిమాగీ నక్సల్స్ మాటతో మళ్లీ కొత్త చర్చ లేపారు. అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన అనుభవంతో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పెద్దగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేవలం ఎన్నికలు, గెలుపు అన్న ధోరణిలో పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలిస్తే పాలక పార్టీలు ఏవీ కూడా ధరల గురించి మాట్లాడడం లేదు. 80కి కిలో బియ్యం కొనడమెలా ఆలోచించడం లేదు. జిఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయా లేదా అన్నది చూసుకుంటూ మురిసిపోతున్నారు. ప్రజల విషయంలో ఇప్పటికైనా ఆలోచన చేయాలి. ధరల పెరుగుదలను అరికట్టడమెలా అన్నదానిపై దృష్టి సారించాలి. లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్కెట్ మారిపోవడం ఖాయం.

## పాకిస్థాన్‌లో దారుణ ఘటన

పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ టిక్‌టాకర్, యూట్యూబర్ షమ్నా బీబీ దారుణ హత్యకు గురయ్యారు. 28 ఏళ్ల ఈ యువతికి టిక్‌టాక్‌లో 1.3 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఆగస్టు 14న టాక్సిలా నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. షమ్నా తన సోదరుడు, సోదరితో కలిసి కారులో వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కాల్పులు జరిపారు. మృతురాలి తండ్రి ఫజల్ సాహిబ్‌జాదా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కాశిఫ్ అనే వ్యక్తి షమ్నాకు ఫోన్ చేసి ఇంటి నుంచి బయటకు రావాలని చెప్పాడు. దీంతో ఆమె తన చెల్లి, తమ్ముడితో కలిసి కారులో బయటకు వచ్చారు.

# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సీఎం చంద్రబాబు వివరించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానిం చాలనీ చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునేలా మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. రాజధాని అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించామని ఈ సందర్భంగా ఏపీ సీఎం గుర్తు చేశారు. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలనీ కేంద్రాన్ని ఆయన కోరారు. దుగ్గరాజుపట్నం పోర్టు, గ్గి÷నైరీ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు కూడా కేంద్ర అనుమతులు మంజూరు చేయాలన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకుపైగా నీటిని మళ్లించే ప్రతిపాదన ఉందన్నారు. గోదావరి - కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గంగా - కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక ఆవశ్యకతను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ముఖ్యమంత్రులు పేర్కొన్నారు. సీనియర్ నాయకుడిగా విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారంటూ సీఎం చంద్రబాబును కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు.

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## విద్యాహక్కు చట్టం కింద లక్ష దాటిన ప్రవేశాలు..

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) అమలులో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ప్రవేశాలు భారీగా పెరిగాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నేడు శాసనమండలిలో ఆర్టీఈ ప్రవేశాలపై సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పేరాబత్తుల రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. “విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) కింద ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే ప్రక్రియను ప్రజాప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. దీని ఫలితంగా 2022-23 నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు మొత్తం 1,04,046 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. పూర్తి పారదర్శకత కోసం అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నాం“ అని వివరించారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రవేశాల సంఖ్యలో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని లోకేశ్ గణాంకాలతో సహా వివరించారు. “2022-23 విద్యా సంవత్సరంలో కేవలం 2,203 మంది విద్యార్థులు మాత్రమే ఆర్టీఈ కింద ప్రవేశాలు పొందారు. కానీ, ప్రజాప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే, అంటే 2024-25లో, ఈ సంఖ్య ఏకంగా 29,000కు పెరిగింది. అదేవిధంగా, 2026-27లో 28,742 మంది విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో సీట్లు లభించాయి. ఇది మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం“ అని అన్నారు. విద్యాహక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టిందని, దాని ఫలితంగానే అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు పెరిగాయని మంత్రి తెలిపారు. సమాజంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆర్టీఈ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాల్సిందే: జగన్

ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీ డీఎస్సీ నియామక చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రశ్నాపత్రం తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే అధికారి చేతిలో పెట్టారని జగన్ విమర్శించారు. స్వయంగా మంత్రి నారా లోకేశ్ సభలో ఈ విషయాన్ని అంగీకరించారని, ఇలా రెండూ ఒకే వ్యక్తికి అప్పగించడమే లీకేజీలకు, డీఎస్సీ స్కామ్‌కు బీజం వేసిందని ఆరోపించారు. దీనిపై పారదర్శకత కోసం సీబీఐ విచారణ జరిపించాల్సిందేనని అన్నారు. ప్రశ్నాపత్రాల తయారీ విభాగంలో పనిచేసిన నవీన్ అనే వ్యక్తికి డీఎస్సీలో మొదటి ర్యాంక్ రావడంపై జగన్ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం మొదట నవీన్‌కు ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని అంగీకరించి, ఆ తర్వాత సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌కు హాజరుకాలేదనే నెపంతో రెండో జాబితా నుంచి అతని పేరును తొలగించిందని విమర్శించారు. ఉద్యోగం రాలేదని నవీన్ కోర్టుకు ఎందుకు వెళ్లాడో సమాధానం చెప్పాలని, అసలు ఈ పేపర్ లీక్ నవీన్ ఒక్కడికే పరిమితమైందా లేక ఇంకా ఎంతమందికి చేరిందనే దానిపై సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తప్పులను కప్పిపుచ్చుకునేందుకే అబద్ధాలు చెబుతోందని, చట్టసభల్లో ప్రతిపక్షానికి తగిన సమయం ఇవ్వకుండా, కౌన్సిల్‌లో మాట్లాడకుండా దాటవేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో తమ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1పై తప్పుడు ఆరోపణలు చేస్తూ, అసలు డీఎస్సీ సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విశాఖ స్కూల్లో విద్యార్థి మృతి ఘటనపై స్పందించిన మంత్రి లోకేశ్

చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై లోకేశ్ సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్‘ ద్వారా స్పందిస్తూ, “విశాఖలోని లిటిల్ గార్డెన్ ప్రైవేట్ పాఠశాలలో టీచర్ కొట్టడంతో ఆరేళ్ల ప్రణయ్ తేజ్ మృతి చెందడం అత్యంత బాధాకరం. బాధ్యులైన వారిపై, సంబంధిత పాఠశాల యాజమాన్యంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. మీరు ధైర్యంగా ఉండండి, మీకు కలిగిన ఈ తీరని లోటును ఎవ్వరూ పూడ్చలేరు. మా ప్రభుత్వం మీకు అన్నివిధాలా అండగా ఉంటుంది“ అని తన పోస్టులో పేర్కొన్నారు. హోంవర్క్ పూర్తి చేయలేదనే కారణంతో ఉపాధ్యాయురాలు కొట్టడంతో ప్రణయ్ తేజ్ కుప్పకూలి మరణించాడని ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ స్పందించారు.

నంది పత్రిక
శుక్రవారం 21 - 08 -2026

# అమ్మవారిశాల లో మూడు నూతన భవన రూముల నిర్మాణానికి 18 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించిన గోళ్ళ రాజేష్..





## మొదటి విడతలో 5 లక్షల చెక్కును అందించిన గోళ్ళ రాజేష్.. వైశ్యుల తమ ఆరాధ్య దైవం పై ఉన్న భక్తి ప్రపత్తులను తన ఉదార స్వభావానికి నిలివెత్తు నిదర్శనం..

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 20 ( నంది పత్రిక )** పట్టణంలోని బంగారు అంగళ్ళ పరిసర ప్రాంతంలో వెలసిన వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంకు భవనాసి వాసు ఆహ్వానం మేరకు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు గోళ్ళ రాజేష్ .ఈ కార్యక్రమంలో గోళ్ళ రాజేష్ కు దేవస్థాన ప్రధాన అర్చకులు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో పూల గజమాలతో సత్కరించి అమ్మవారి ఆశీర్వచనాలు మంత్రోచ్చారణ లతో వేద పండితులు గోళ్ళ రాజేష్ ను ఆశీర్వచనాలు అందించారు అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలనందించారు. ఈ సందర్భంగా అమ్మవారిశాల దేవస్థానానికి సంబంధించిన నూతన భవన మూడు రూముల నిర్మాణానికి నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజిక సేవకులు గోళ్ళ రాజేష్ భారీ ఎత్తున విరాళాన్ని ప్రకటించి మొదటి విడతలో 5 లక్షల విరాళాన్ని వైశ్యకుల పెద్దలు భువనాశి వాసు,ఇతర పెద్దల సమక్షంలో 5 లక్షల విరాళ చెక్కును అందించారు. ఈ సందర్భంగా దేవస్థాన పెద్దలు కమిటీ సభ్యులు భవనాశి వాసు ఇతర సభ్యులు గోళ్ళ రాజేష్ ఉదార స్వభావానికి, వారి మంచి మనసుకు అమ్మవారి పై ఉన్న భక్తి ప్రపత్తులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఆ అమ్మవారి ఆశీర్వచనాలు గోళ్ళ రాజేష్ పై ఎల్లప్పుడూ ఉండాలని మూడు రూముల నిర్మాణానికి 18 లక్షల రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించిన గోళ్ళ రాజేష్ కు కృతజ్ఞతలు,అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో భవనాసి వాసుతో పాటు పలువురు వైష్య కుల పెద్దలు, కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



# “ నంద్యాల ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నాం .





## మంత్రి తనయులు ఫిరోజ్,ఫయాజ్ పర్యటన.

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 20 ( నంది పత్రిక )**
నంద్యాల పట్టణం 2వ వార్డు మదర్ పట్టిలో నిర్వహించిన “ఇంటింటికీ తెలుగుదేశం” కార్యక్రమంలో మంత్రి తనయులు ఫిరోజ్,ఫయాజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆత్మీయంగా కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా కృషి చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే “ఇంటింటికీ తెలుగుదేశం” కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తూ ప్రజల కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర మంత్రివర్యులు, నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్ నాయకత్వంలో నంద్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తీరుతామని ఫిరోజ్ అన్నారు. నంద్యాల ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్ జీలాన్, జాకిర్, గోరె మూర్తుజా,కొమ్ము శ్రీహరి, అదిల్, కరీం,ఖాజా, గోవిందా నాయుడు, జల్లిపల్లి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దళితవాడలను అభివృద్ధి చేయాలి

## -ధర్నాను జయప్రదం చేయండి

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 20. (నంది పత్రిక ):** నంద్యాల జిల్లా కేంద్రంలోని బయటిపేట లో డ్రైనేజి సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా బయటి పేట లో మురికి కాల్వలు తీసే నాధుడే కరువయ్యారని . నెలకు ఒక్కసారి మురికి కాల్వలు తీసిపోతున్నారని, మురికి కాల్వలలో చెత్త, చెదారం పేరుకు పోవాల్సిందే నాని, కాలువలు రెగ్యులరగా తీయకపోవడంతో దుర్వాసన తో అల్లాడిపోతున్నామని అక్కడి దళితులు సామాజిక శాంఖారావం లొ భాగంగా పాదయాత్ర కు వెళ్లిన నాయకులకు తమ సమస్యలను వివరించారు. ఇక్కడ కాలనీ లలో చిన్న చిన్న సందుల్లో ఉన్న కాలువలు తీయకపోవడంతో వర్షం పడితే చాలు డ్రైనేజి నుండి వచ్చే వాసన బయటికి రావాలంటే ఇబ్బందిగా ఉంటుందని అక్కడి నివాసిత ప్రజలు నాయకులతో వాపోయారు. మీరైనా పట్టించుకోండి.. మాసమస్యలు పరిష్కరించండి అంటూ నాయకులతో మోర పెట్టుకున్నారు. నెలలు తరబడి మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనతో అల్లాడిపో తున్నామని స్థానికంగా దళిత ప్రజలు వాపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లొ కెవిపిఎస్ జిల్లా నాయకులు లక్ష్మణ్, పుల్లా నరసింహులు, సీఐటీయూ సీనియర్ నాయకులు తోట. మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్ పి వెంకట లింగం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ వీరితోపాటు శ్రీనివాసులు, వెంకటరావు, షఫీ, జాకీర్ పాల్గొన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. నాగరాజు మాట్లాడుతూ నంద్యాల పట్టణం లోని ఆరు వార్డులలో దళితవాడల సర్వేను చేయాలని నిర్ణయం చేయడం జరిగింది. దళితవాడ సర్వేల అనంతరం గత మూడు రోజులుగా పాదయాత్ర నిర్వహించి అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయడం జరిగిందని అయితే అధికారుల తీరు మారడం లేదని,నిర్లక్ష్యం పరాకాష్ట కు చేరిందని అన్నారు. పొన్నాపురం, పొన్నాపురం కాలనీ ఈ వార్డులో దళితులకు స్మశాన స్థలము పూర్తిగా లేదు. స్మశాన స్థలం జీవో నెంబర్: 1235 ప్రకారం కేటాయించాలని, అదేవిధంగా దళిత వాడలకు



వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి గుంతలతో ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రధాన రహదారిని సిమెంట్ రోడ్డు గా వెయ్యాలని కోరుతున్నారు. అదేవిధంగా దళితవాడ లలో ఉన్న సిమెంటు రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేవు. ఉన్న కాలువల నుంచి మురికిని శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం ఉంది. నూనెపల్లె -హరిజన వాడ ఈ వార్డులో పూర్తిగా పారిశుధ్యం పడకే సింది. నెలలో ఒక్కసారి వచ్చి డ్రైనేజీ కాల్వ లను శుభ్రం చేస్తారు లేదా అసలు రాకుండా ఉండే వీధులు కూడా ఉంది. అక్కడ తీవ్రమైనటువంటి ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అక్కడ రోగాలు వస్తున్నాయని చెప్పడం జరిగింది. బయటి పేట ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు లోతుగా లేకపోవడం క్లీన్ చేయకపోవడం వలన చెత్త, మురికి పేరుకుపోయి వాసన రావడం నిల్వ ఉండడం వలన ఎవరి ఇంటి దగ్గర వాళ్లే కట్టెలను పెట్టుకుని క్లీన్ చేసుకోవడం జరుగుతుంది. సమస్య ఏళ్ల తరబడి జరుగుతున్న మున్సిపాలిటీ పట్టించుకోవడం లేదు. హరిజన పేట నుండి పివి నగర్కు వెళ్లే ప్రధాన రహదారిలో డంప్ యార్డును ఏర్పాటు చేయడం ద్వారా పివి నగర్, హరిజన పేట లో నివసిస్తున్న దళితులు డంప్ యార్డ్ నుండి వచ్చేటువంటి వాసన, పొగ వలన అనేక రోగాల బారిన,చర్మ వ్యాధులు వస్తున్నాయని భయపడుతున్నారు. వెంటనే ఎత్తివేయాలని ప్రజలు చాలా కోపంతో ఉన్నారు. నందమూరి నగర్ వైయస్ నగర్ లో నివసిస్తున్న దళితుల వాడలకు వెళ్లే ప్రధాన రహదారి ని సిమెంట్ రోడ్డు వేయకుండా రాజకీయ కారణాలతో ఆపివేయడం జరిగింది. వర్షం వస్తే నీరు నిల్వ ఉండడం గుంతలు ఏర్పడడం చాలా సమస్యగా ఉంది డ్రైనేజీ కాలువలు లేవు ఉన్న కాలువలలో ఉన్న చెత్తను శుభ్రం చేయడంలో మున్సిపాలిటీ నుండి నిర్లక్ష్యం ఉంది. అదే విధంగా చాలా సంవత్సరాల క్రితం స్మశాన స్థలం కేటాయించిన నేటి వరకు అక్కడ నివసించేటువంటి దళితులకు స్మశాన స్థలం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఉంది. పై సమస్యల పరిష్కారం కోసము ఈ నెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే దళితవాడలోని సమస్యలను పరిష్కారం చేయడం కోసం ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది అప్పటికి పరిష్కారం కాకపోతే సీఐటీయూ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన లను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రపంచ దోమల దినోత్సవం.



**బేతంచెర్ల ఆగస్టు 20 ( నందిపత్రిక ).** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బేతంచెర్ల మండలము ఆర్ఎస్. రంగాపురం గ్రామం జిల్లా పరిషర్ స్కూల్ విద్యార్థులతొ డాక్టర్ అబ్దుల్ అలీం,సుబ్బరాజ మరియు ప్రధాన ఉపాధ్యాయులు శ్రీదేవి సమావేశం నిర్వహించారు.

**ఈ సమావేశం లో విద్యార్థులకు అవగాహన కలిపిస్తూ** (వరల్డ్ మోసక్విటో డే ) ప్రతి సంవత్సరం ఆగస్టు 20న నిర్వహించ బడుతుంది. గురువారం రోజును 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్ రాస్ ఆడ దోమల ద్వారా మలేరియా జ్వరం మనుషులకు వ్యాప్తి జరుగుతుందని కనుగొన్న విషయాన్ని గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తారు. మలేరియా, డెంగ్యూ,చికున్ గున్యా,మెదడు వాపు వ్యాధి, బోధకాలు వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని దోమల నివారణే వ్యాధుల నివారణ అని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించటం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నిల్వ నీటిని తొలగించాలని ప్రజల్లోకి తీసుకెల్లి అవగాహన కల్పించటం. దోమతెరలు, రిపెల్లెంట్లు వంటి రక్షణ చర్యలు పాటించాలని తెలుపటం. జ్వరం వచ్చినప్పుడు వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించు కోవాలని. ప్రజలకు అవగాహన కల్పించటం జరిగినది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సూపెర్వైజర్స్ గఫార్,ధరుణమ్మ,రాజ్యలక్ష్మి హెల్త్ అసిస్టెంట్స్ రామాంజనేయులు,విజయ్,సి హెచ్ఓ సింధు ఎఎన్ఎం సుగుణ ఆశాలు మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పద్మావతి నగర్ పార్క్ కు సిమెంట్ బెంచ్ లు వితరణ




**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 20. (నంది పత్రిక ):** నంద్యాల పద్మావతి నగర్ పార్క్ నందు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి సహకారంతో 20 వేల రూపాయల గల ఐదు సిమెంట్ బెంచ్ లను వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి పి డి జి లు కల్లూరి. రామలింగారెడ్డి శ్రీరామ్మూర్తి అసిస్టెంట్ గవర్నర్ దండే దస్తగిరి డాక్టరు విజయ భాస్కర్ రెడ్డి మాలెపాటిరాజశేఖర్ సుబ్బరామయ్య లక్కా భూషణం అయ్యన్న చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## -శాంతిరాం కళాశాల ప్రిన్సిపాల్ డా.సుబ్రహ్మణ్యం




**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 20. (నంది పత్రిక ):** శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), పాణ్యం, నంద్యాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో “గ్రీన్ సద్భావన ప్లాంటేషన్ డ్రైవ్ 2026” కార్యక్రమాన్ని సద్భావన దివస్ మరియు అక్షయ ఉర్జా దివస్ సందర్భంగా ఆగస్టు 20, 2026న కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. వి. సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని, మొక్కల నాటడం మరియు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన మరియు పచ్చని వాతావరణాన్ని అందించేందుకు ప్రతి విద్యార్థి మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. రామచంద్రుడు మాట్లాడుతూ, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించవచ్చని తెలిపారు. “వన్ స్టూడెంట్ వన్ ట్రీ వన్ ఫ్యూచర్” అనే సందేశంతో ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పర్యావరణ పరిరక్షణ, హరిత వాతావరణం మరియు మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించారు. “ప్లాంట్ ఫర్ హార్మోనీ , గ్రో ఫర్ హ్యుమానిటీ” అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యత, సామాజిక స్పృహ మరియు సేవా భావాన్ని పెంపొందించారు. అలాగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు లక్ష్యం 13: క్లైమేట్ ఆక్షన్ మరియు లక్ష్యం 15: లైఫ్ ఆన్ ల్యాండ్ కు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మొక్కలను నాటడమే కాకుండా, వాటిని నిరంతరం సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. వి. సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ పిఓ జి. రామచంద్రుడు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు మరియు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిసింది. ఒక మొక్క నాటుదాం రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందిద్దాం.”



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 20 నంది పత్రిక** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డలోని కోర్టు ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివరామిరెడ్డి, సెక్రటరీ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



# రైతులకు తాగు సాగు నీటి పోరాటం కోసం త్వరలో కార్యాచరణ ప్రకటిస్తాం...

**తెలంగాణ నీటి దోపిడీని చంద్రబాబు అడ్డుకోలేకున్నారు....**

**ఓటుకు నోటు కేసు లో దొరికి చంద్రబాబు అమరావతికి మకాం మార్చారు...**

**శ్రీశైలం నుండి నీటిని విడుదల చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలి:**

**మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విజ్ఞప్తి**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 20 ( నంది పత్రిక )** వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాయలసీమ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవడానికి శ్రీశైలం ప్రాజెక్ట్ నుండి వెలుగోడు, గోరుకల్లు, అవుకు మరియు మైలవరం రిజర్వాయర్లకు వెంటనే నీటిని విడుదల చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నియోజకవర్గ పరిధి లోని వివిధ మండలాల రైతులతో నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీరు, సాగునీరు అందిం చేందుకు చేపట్టిన కార్యాచరణ ప్రణాళికపై రైతుల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడిన ముఖ్య అంశాలు: శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 857 అడుగుల మేర నీటి నిల్వలు ఉండి, 110 టీఎంసీల నీటితో ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పటికీ దిగువకు నీరు విడుదల చేయకపోవడం శోచ నీయ మన్నారు. మునుపెన్నడూ లేని విధంగా రైతులు నీటికై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం ఆరుతడి పంటలను కాపాడుకోవడానికి, పశువుల తాగునీటి అవసరాలు తీర్చడానికైనా ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం ఎడమ గట్టు నుంచి రోజుకు 4 టీఎంసీల నీటిని తరలిస్తూ, దాదాపు 15 ప్రాజెక్టులకు నీటిని ఇస్తున్నా ఏపీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎంతో చేసుకున్న చీకటి ఒప్పందం



వల్లే రాయలసీమకు ఈ నీటి కష్టాలు వచ్చాయని విమర్శించారు. ప్రధానంగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, శ్రీశైలం నుండి దిగువ రిజర్వాయర్లకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన పలువురు రైతు నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# హంద్రీ నదికి నీటిని విడుదల చేయాలి

**18 గ్రామాల తాగునీటి సమస్య పరిష్కరించాలి**

**68 చెరువుల ప్రాజెక్టుకు నీరు ఇవ్వాలి**

**కలెక్టర్‌కు కేపియస్ అధినేత శ్రీహర్ష విజ్ఞప్తి**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కోడుమూరు, కల్లూరు మండలాల్లో హంద్రీ నది పరివాహక ప్రాంతంలోని 18 గ్రామాల్లో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) నుంచి లద్దగిరి సమీపంలోని స్లూయిస్ ద్వారా హంద్రీ నదికి నీటిని విడుదల చేయాలని కేపీఎస్ అధినేత ఎం.శ్రీహర్ష కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరికి ఎం.శ్రీహర్ష లేఖ రాశారు. ఎల్‌నినో ప్రభావంతో కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొని, ముఖ్యంగా కోడుమూరు, పాణ్యం నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని శ్రీహర్ష పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఈ ప్రాంతానికి జీవనాడిగా ఉందని, ఆగస్టు 12 నుంచి కాలువలో నీటి ప్రవాహం కొనసాగుతుండగా సుమారు 3,050 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని



తెలిపారు. కర్నూలు జిల్లాకు హంద్రీనీవా ప్రవాహంలో దాదాపు 30 శాతం వాటా ఉన్నప్పటికీ, జిల్లాలోని స్లూయిస్‌లను మూసివేసి ఇతర జిల్లాలకు నీటిని తరలిస్తున్నారని, దీంతో కర్నూలు జిల్లా గ్రామాలకు తాగునీటి అవసరాలు తీరడం లేదని పేర్కొన్నారు. లద్దగిరి సమీపంలోని స్లూయిస్‌ను తెరిచి హంద్రీ నదిలోకి నీటిని విడుదల చేయాలని ప్రజలు, సంఘాలు, మేధావులు ఇప్పటికే అధికారులను కోరినట్లు తెలిపారు. తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు బోరు బావుల రీచార్జ్, భూగర్భ జలాల అభివృద్ధి కోసం లద్దగిరి స్లూయిస్ ద్వారా హంద్రీ నదికి కనీసం 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని శ్రీహర్ష కోరారు. అలాగే 68 చెరువుల ప్రాజెక్టుకు రోజుకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇది అదనపు నీటి కోరిక కాదని, కర్నూలు జిల్లాకు రావాల్సిన న్యాయమైన వాటా అని పేర్కొన్నారు. తాగునీటి సమస్య కారణంగా కోడుమూరు, పాణ్యం ప్రాంతంలోని గ్రామాల ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి తాత్కాలికంగా కర్నూలుకు వలస వెళ్తున్న పరిస్థితి నెలకొందని శ్రీహర్ష తెలిపారు. సమస్యపై ప్రభుత్వానికి తక్షణమే నివేదించి, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను ఆదేశించి లద్దగిరి స్లూయిస్ ద్వారా హంద్రీ నదికి, 68 చెరువుల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని శ్రీహర్ష కోరారు.

# బీసీలకు రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం చారిత్రాత్మకం

**టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్**

**చంద్రబాబు,పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు20 ,( నంది పత్రిక )** రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలైన బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభలో తీర్మానం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏవిఆర్ ప్రసాద్ వెల్లడించారు. గురువారం ఏవిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ, 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిన విషయాన్ని ఏవిఆర్ ప్రసాద్ గుర్తు చేశారు. దీనివల్ల బీసీ వర్గాలకు రాజకీయంగా తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీల కోసం 56 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమించినప్పటికీ, వాటికి తగిన నిధులు, విధులు, అధికారాలు కల్పించకపోవడంతో అవి ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోయాయని ఆయన అన్నారు. కేవలం పదవులు ఇవ్వడం మాత్రమే కాకుండా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, అధికారాలు, అభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యేలందరూ ఏకగ్రీవంగా 34 శాతం బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపడం బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బీసీల రాజకీయ సాధికారతకు 34 శాతం రిజర్వేషన్లు కీలకమైన అడుగు అని, బీసీల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తులో మరింత బలమైన రాజకీయ ప్రాతినిధ్యానికి దోహదపడతాయని ఏవిఆర్ ప్రసాద్



పేర్కొన్నారు. అనంతపురం కు చెందిన పార్టీ సామాన్య కార్యకర్త, బీసీ కులానికి చెందిన దళవాయి రమాదేవిని గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యురాలిగా ఎంపిక చేయడం బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ ఇస్తున్న ప్రాధాన్యతకు నిలువుటద్దంగా నిలిచిందని ఏవిఆర్ ప్రసాద్ పేర్కొన్నారు.

# చెత్త కుప్పలు లేని నగరాన్ని నిర్మిద్దాం

**నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపు**

**36 జీవీపీలకు సరికొత్త రూపాంతరం**

**50 జీవీపీల వద్ద సీసీ కెమెరాలతో నిఘా**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ) లేని పరిశుభ్రమైన నగరంగా కర్నూలును తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్, గాంధీనగర్, రోజా స్ట్రీట్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని సుందరంగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగర పరిధిలో 135 జీవీపీలను గుర్తించగా, ఇప్పటికే 36 జీవీపీలను శుభ్రపరిచి గ్రీనరీ, మొక్కలు, బెంచీలు ఏర్పాటు చేసి సరికొత్త రూపాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు, జీవీపీలు తిరిగి చెత్త కుప్పలుగా మారకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మిగిలిన జీవీపీల్లో దశలవారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై నిఘా ఉంచి జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 జీవీపీల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలని సూచించారు. జీవీపీలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని కోరారు. నగరంలో సుమారు 1,55,914 గృహాలు ఉండగా, ఇంటింటి చెత్త సేకరణ కోసం 1,194 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు అందుబాటులో ఉన్నారని, పారిశుద్ధ్య పనుల్లో ఏవైనా లోపాలు గుర్తిస్తే వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, అనిల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



# 22 నుండి స్పెషల్ క్యాంపెయిన్ డే

**నియోజకవర్గ ఓటర్లు సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**18 ఏళ్లు నిండిన పౌరులు ఓటరుగా నమోదు కావాలి**

**కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్2026 ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, కుటుంబ సభ్యుల పేర్లు కూడా పరిశీలించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన పౌరులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు లేని వారు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో ఉన్న పేర్లలో తప్పులు, మార్పులు, సవరణలు ఉంటే ఫారం8 ద్వారా, అనర్హులు, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లకు సంబంధించి ఫారం7 ద్వారా అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నామని, ఓటర్లు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు.

# మెరుగైన నగరాల నిర్మాణం కోసం యువజన కాంగ్రెస్ ఐక్య పోరాటం

**యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ ప్రదీప్ రాయల్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మెరుగైన నగరాల నిర్మాణం కోసం యువజన కాంగ్రెస్ ఐక్య పోరాటం చేస్తుందని యువజన కాంగ్రెస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఏ ప్రదీప్ రాయల్ తెలియజేశారు. గురువారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు యన్ పవన్ తేజా నాయుడు సూచనల మేరకు కర్నూలు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ ప్రదీప్ రాయల్ ఆధ్వర్యంలో ఐవైసీ 'అర్బన్ సిటీ కాంపెయిన్' పోస్టర్ లాంచ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీనిధి రాయల్, విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు నగరానికి ఉద్దేశిస్తూ నగరంలోని అసంఘటిత, కార్మికుల రక్షణకై "బెటర్ సిటీస్...అర్బన్ పాలిటిక్స్" అనే క్యాంపెయిన్ ను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ మరియు గౌరవప్రదమైన జీవన హక్కును కల్పించిందని పేర్కొన్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లోని నగరాలను తమ శ్రమతో నడిపిస్తున్న స్విగ్గి, జొమాటో, డెలివరీ, రంగాలు లాంటివి మరెన్నో అసంఘటిత కార్మికులకు నేటికీ కూడా క్షేత్రస్థాయిలో ఈ హక్కులు నిరాకరించ బడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ శ్రామికుల రాజ్యాంగ హక్కులైన ఆర్టికల్ 14, 19, 21 ల సాధనకై "మెహనత్ కే హాత్" ఫ్రేమవర్క్ ను మొదలుపెట్టాము అని తెలియజేశారు. రాబోవు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జి శ్రీనివాస్ యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీనిధి రాయల్, విజయ్ నంద్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, కర్నూలు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మన పని - మన దైవం.. అనే విధంగా విధులు నిర్వహించండి.

**నగరంలో పారిశుద్ధ్యం, సుందరీకరణ పనులు చురుగ్గా చేపట్టండి. కమిషనర్ ఎం. జయకృష్ణ.**



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక** నగరపాలక సంస్థలో పనిచేసే వారు పనియే ప్రత్యక్ష దైవంగా భావించి తమ విధులను అంకితభావంతో నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం ఉదయం నగరంలోని గాంధీ రోడ్డు, మంచాల వీధి, పి.పి.చావడి, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసం, రైల్వేస్టేషన్, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు, ప్రజల రద్దీ ప్రాంతాల్లో పారిశుధ్యం పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగ్గా చేపట్టెందుకు రెండు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరంలో రోడ్లపైన ఎక్కడా చెత్త కనపడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. నగరంలోని అన్ని కూడళ్ళలో, డివైడర్ల మధ్యలో ఎండిన మొక్కలను, చెత్తను తొలగించి కొత్త మొక్కలను నాటించాలని తెలిపారు. ముఖ్యంగా అన్ని కూడళ్ళలో రంగురంగుల పూల మొక్కలను నాటించి సుందరంగా తీర్చి దిద్దాలని అధికారులకు ఆదేశించారు. అలాగే డివైడర్లకు పెయింటింగ్స్ వేయించాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి మన పని - మన దైవం అనే భావనతో విధులు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, ఉన్నారు.



# ప్రత్యామ్నాయ చర్యలకు పూనుకుంటున్న రైతులు




**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 20 :** కర్నూలు కడప కాలవతో పాటు, తెలుగు గంగ కాలువకు నీళ్లు రావని రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా తేల్చి చెప్పడంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ చర్యలకు పూనుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేయలేకపోతే అటు అన్నదాతలకు, ఇటు ప్రజలకు అన్నం మెతుకులు కరువయ్యే పరిస్థితిలు కూడా నెలకొంటాయని గుర్తించిన రైతులు సాగునీటి కోసం చర్యలు చేపడుతూ ఉన్నారు. బోరుబావుల కింద, వాగుల కింద రైతులు ఇప్పటికే వందలాది ఎకరాల్లో వరిని సాగు చేశారు. మొదట్లో బోర్ల ద్వారా ఆశించిన రీతిలో నీళ్లు వచ్చినప్పటికీ, తర్వాత భూగర్భ జలాలు ఇంకిపోవడంతో రైతాంగం ఆందోళనకు గురైంది. జూలైలో అడప దడపాగా కురిసిన వర్షాల కారణంగా కొంతమేరకు భూమిలో భూగర్భ జలాలు పెరిగిపోవడంతో రైతులు ఆనందపడ్డారు. ప్రస్తుతం వర్షాలు ఆగిపోవడంతో పొలాలను నీటితో తడుపుకునేందుకు, రైతులు అవస్థలు పడుతూ ఉన్నారు. ఈ కారణంగా తమ పొలాల్లో అదనంగా బోర్లు వేసుకునేందుకు రైతులు సంసిద్ధులవుతున్నారు. సంత జూటూరు గ్రామంలో ఇప్పటికే కొందరు రైతులు పొలాల్లో బోర్లను వేసుకొని పనిలో పడుతున్నారు. బోర్లను వేసుకుని విషయంలో గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి అనే రైతును కదిలిస్తే బోర్ల ఏర్పాటు విషయాలను గురించి వివరించారు. బోర్ వేసేందుకు 40 వేల రూపాయలు దాకా ఖర్చు వచ్చిందని తెలిపారు. 120 అడుగుల లోతు మేరకు బోర్ వేసినందుకు నీళ్లు పడ్డాయని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 250 అడుగుల వరకు బోరు వేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం రెండు ఇంచుల మేరకు నీళ్లు వస్తున్నాయని, దీనికి మోటారు ఏర్పాటు చేసేందుకు మరో 75000 దాకా ఖర్చు అయిందని తెలిపారు. బోరు వేయడం వల్ల తనకున్న ఆరు ఎకరాల పొలంలో వరి సాగు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. నీటి సౌకర్యం బాగా ఉన్నందువల్ల రెండు కార్లు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మహేశ్వర్ రెడ్డి బోరు వేసుకున్న పరిస్థితిని గుర్తించి మరి కొంతమంది రైతులు బోర్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం..!

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప బ్యూరో చీఫ్, ఆగస్టు 20: నంది పత్రిక** జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కు వివరించారు.గురువారం విజయవాడ నుండి ఎస్ ఐ ఆర్ నిర్వహణ, పురోగతిపై.. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో.. కడప జిల్లా కలెక్టర్ బంగ్లా నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొని, జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు.జిల్లాలో మొత్తం 3,07,685 నోటీసులు జారీ చేయాల్సి ఉండగా అన్నింటినీ జారీ చేశామని, ఇప్పటివరకు 2,51,371 నోటీసులు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే 32,949 విచారణలు పూర్తిచేసినట్లు వివరించారు.క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంలో భాగంగా ఫారం6, ఫారం7, ఫారం8 ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, ఓటర్ల జాబితా నవీకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఫారం7 కింద 2,66,041 దరఖాస్తులు అందగా, వాటిలో 2,62,915 దరఖాస్తులు ఆమోదించబడినట్లు వివరించారు.పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలు, క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కారం, ధ్రువీకరణ ప్రక్రియలను వేగవంతం చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్డు మీటింగ్ హాలు నుండి డీఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి, సంబంధిత ఎన్నికల, రెవెన్యూ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# పట్టుసాగుపై రైతులకు శాస్త్రీయ పద్ధతిలో అవగాహన

## - సెంట్రల్ సిల్క్ బోర్డ్ సైంటిస్ట్ డాక్టర్ అర్చన



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని కొక్కెరంచ గ్రామ శివారుల్లోని మల్బరి పొలాల్లో గురువారం సెంట్రల్ సిల్క్ బోర్డ్ సైంటిస్ట్ డాక్టర్ అర్చన అధ్యక్షతన సుస్థిర పట్టుసాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో పట్టు సాగుచేసు కోవడంవల్ల రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. అదేవిధంగా మల్బరీ తోటలలో చీడపీడలు, తెగుళ్ల సమర్థవంతమైన నిర్వహణ కోసం శాస్త్రీయ సాంకేతికతలు సిఫార్సు చేయబడిన పద్ధతులను పాటించడం యొక్క ప్రాముఖ్యతను వివరించామన్నారు. అలాగే, కొత్త రైతులకు అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలు, రాయితీల గురించి వివరించి: ప్రయోజనాలను పొందాలని వారిని ప్రోత్సహించారు. మల్బరీలో వేరు కుళ్ళు తెగులు, కీటక తెగుళ్ల నిర్వహణపై సాంకేతిక ప్రదర్శనలను నిర్వహించారు. వేరు కుళ్ళు తెగులు నివారణకు సాఫ్ వాడకం, దాని 'వెయిటింగ్ పీరియడ్' (మందు వాడిన తర్వాత ఆకులను వాడటానికి పాటించాల్సిన విరామ సమయం) సురక్షిత వినియోగ మార్గదర్శకాలను ప్రదర్శించారు. కీటక తెగుళ్ల నివారణకు ఎంఆర్ ప్రో, రూట్ ఫిక్స్,వేప నూనె వంటి ఇతర సిఫార్సు చేయబడిన పద్ధతులను, కూడా రైతులకు వివరించి ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు: కార్యక్రమంలో ఏఎస్ఓ లింగమూర్తి, టెక్నికల్ ఆఫీసర్ శివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు అరవింద్, కలామ్మ్లు, రైతులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతు రుణాలను వెంటనే మాఫీ చేయ్యాలి

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లాలో రైతులు కే డి సి సి బ్యాంక్ ద్వారా అప్పులు తీసుకున్న రైతుల అప్పులు చెల్లించడం లేదని వారి పొలాలను వేలం వేస్తామని బ్యాంక్ అధికారులు ప్రకటించడానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం ఒక ప్రకటనలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సంవత్సరం జిల్లాల్లో వర్షాభావము వలన తీవ్రతమైన కరువు ఉన్నది ఈ కరువు వల్ల పంటలన్ని ఎండిపోయాయి ఏ పంట కూడా సక్రమంగా పంటలు పండలేదు లక్షల ఎకరాలు బీడు భూములుగా ఉన్నాయి ఇప్పుడు వర్షాలు వచ్చినా పంటలు పండవు ఇలాంటి పరిస్థితులలో బ్యాంకు అధికారులు తమ బ్యాంకు రుణాలను వసూలు చేయడానికి పూనుకోవడం సరైన పద్ధతి కాదు ఎందువలనంటే రైతులు తీసుకున్న క్రాఫ్ లోన్స్ లాంగ్ టర్మ్ లోన్ ల్యాండ్ డెవలప్మెంట్ లోన్ ఏది కూడా చెల్లించలేరు వర్షాలు లేక పంటలు పండకుండా ఉంటే ఇలాంటి పరిస్థితులలో రైతుల రుణాలు ఏ విధంగా చెల్లిస్తారు గతంలో రైతులు బ్యాంకులు దగ్గర రుణాలు తీసుకున్నారు సక్రమంగా చెల్లించారు మల్ల తిరిగి బ్యాంకులు కూడా రైతులుకు రుణాలు ఇచ్చారు కావున ఈ నేపథ్యంలో ఇంత తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నందువలన తక్షణమే రైతుల పొలాలు వేలం వేస్తామనేటువంటి ఆలోచనను మానుకోవాలి గ్రామాలలోకి పోయి వేలం వేయడానికి పోతే రైతులు తిరుగుబాటు చేస్తారు ఘర్షణలు మొదలవుతాయి కావున జిల్లా మొత్తాన్ని కర్నూలు కరువు జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము బ్యాంకుల రుణాలు కూడా వసూలు చేయరాదని బ్యాంకులో రుణాలన్నీ మాఫీ చేయాలని రైతాంగ ఆదుకోవాలని వడ్డీతో సహా మొత్తం రుణాలన్నీ మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని పదేపదే డిమాండ్ చేస్తున్నాము ఈ నేపథ్యంలో పుండు మీద కారం చల్లినట్లుగా రైతులు బాధల్లో ఉంటే పంటలు అన్ని ఎండిపోతుంటే రైతుల పొలాలను వేలం వేస్తామని వేలానికి పోవడం సరైన పద్ధతి కాదు కావున బ్యాంక్ అధికారులు వాస్తవ పరిస్థితులను గమనించాలి గుర్తించాలి గ్రామాల్లో ఎడారి పరిస్థితులు ఉన్నాయి స్మశాన వాటిక లాగ ఉన్నాయి ఈ పరిస్థితుల్లో మీరు గ్రామాలకు పోతే మరికొన్ని కొత్త సమస్యలు ఏర్పడతాయి కావున తక్షణమే రైతుల పొలాలను వేలం వేసి తమ బ్యాంకు డబ్బులు జమ చేసుకోవాలనేటువంటి ఆలోచన తక్షణమే బ్యాంక్ అధికారులు విరిమించుకోనేలగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఆద్యుడు

## యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించినది మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

## మాజీ ఎమ్మెల్సీ యం సుధాకర్ బాబు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి (సమాచార సాంకేతిక విప్లవ) ఆద్యుడు స్వర్గీయ రాజీవ్ గాంధి అని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు కొనియాడారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82 వ జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుధాకర్ బాబు మాట్లాడుతూ కంప్యూటర్, సాంకేతిక టెలీ, కమ్యూనికేషన్ల రంగంలో ఆధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్తపుంతలు తొక్కిన భారత్ ఇవాళ ఆ ఫలితాలను భారత జాతి ఆస్వాదిస్తుందంటే అలాగే నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి సెల్ ఫోన్లు అందుబాటులోనికి వచ్చిందంటే అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ కృషి అని ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో దూసుకుపోతున్న వేళ మన దేశంలోనూ సాంకేతిక విప్లవం రావాలని దేశానికి మొట్టమొదటి కంప్యూటర్ ఇవ్వడమే కాకుండా ఆ రంగంలో నూతన శకానికి రాజీవ్ గాంధీ బాటలు వేశారని, సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలు సమకూర్చాలని ఎంతో తపన పడ్డారని మన దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఆయన చేసిన ప్రయత్నాన్ని మేధావులు సైతం ప్రశంసించారని,18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ కే దక్కుతుందని గ్రామీణభివృద్ధి, కంప్యూటర్ రంగాన్ని అభివృద్ధి చేసి దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకు వెళ్లిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని పారిశ్రామిక రంగంలో పన్ను తగ్గింపు విధానాన్ని అవలంభించి, రక్షణ, విమానయాన, వాణిజ్య రంగాలు అభివృద్ధి చెందడానికి కారణం రాజీవ్ గాంధీ అని ఈ విధానం వలన ఆధునిక ఆర్థిక విధానం వలన విదేశి పెట్టుబడులను ఆకర్షించి పెట్టుబడులకు భారత్ ని స్వర్గధామం చేసిన ఘనత రాజీవ్ గాంధీ కి దక్కుతుందని 1986 లో న్యూ నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్ గాంధీ కే దక్కుతుందనీ ఈ పాలసీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో తోడ్పడిందని, నవోదయ పాఠశాలలు స్థాపించి విద్యలో ఒక గొప్ప మార్పుకు కారణమైన వ్యక్తి రాజీవ్ గాంధీ గారనీ 1987లో బ్లాక్ బోర్డు ఆపరేషన్,1985 లో ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ, నవోదయ స్కూల్స్ వీటి వల్ల గ్రామీణ ప్రాంతాలలో నివసించే పిల్లలు విద్యావంతులుగా అవడానికి కారణమైన వ్యక్తి రాజీవ్ గాంధీ అనీ సుధాకర్ బాబు రాజీవ్ గాంధి సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక సి క్యాంప్ సెంటర్ నందలి రాజీవ్ గాంధీ కాంస్య




విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్ సి బజారన్న, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు శ్రీనిద్ రాయల్, విజయ్ కర్నూలు, నంద్యాల జిల్లాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ ప్రదీప్ రాయల్, జి శ్రీనివాస్ యాదవ్, నంద్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ కర్నూలు నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ అలీ ఖాన్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, బి సుబ్రహ్మణ్యం, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, మద్దిలేటి మొదలగువారు పాల్గొన్నారు.

# నోటీసుల పంపిణీకి బూత్ లెవెల్ ఏజెంట్లు సహకరించాలి.

## నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం. జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక**ప్రత్యేక ఓటర్ల జాభితా సవరణ+ ఎస్ ఐ ఆర్) లో భాగంగా ప్రస్తుతం నో మ్యాపింగ్ మరియు అనామలీస్ ( తార్కిక వ్యత్యాసాలు ) ఓటర్లకి నోటీసులను పంపిణీ చేస్తున్న అధికారులకు బూత్ లెవెల్ ఏజెంట్లు, అన్ని పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం. జయకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ మరియు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో నగరపాలక సంస్థ కార్యాలయం లో 167 తిరుపతి నియోజకవర్గ నమోదు అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ రివిజన్లో భాగంగా ప్రస్తుతం నో మ్యాపింగ్ మరియు అనాలిసిస్ ఓటర్ల కి నోటీసులను అధికారులు పంపిణీ చేస్తున్నారని, ఈ సందర్భంలో బూతుల ఏజెంట్లు బిఎల్వోలకు సహకరించాలని తెలిపారు. అలాగే నిర్దేశిత ప్రాంతంలో నోటీసులో కనబరిచిన తేదీ నాటికి నోటీసులో కనబరిచిన తేదీ మరియు ఆ సమయానికి ఈసీఐ నిర్దేశించినటువంటి 11 డాక్యుమెంట్లలో 1987 ముందు పుట్టినట్లయితే ఒక డాక్యుమెంట్, 1987 మరియు 2004 మధ్యన పుట్టినట్లయితే రెండు డాక్యుమెంట్లు మరియు 2004 తర్వాత జన్మించినట్లయితే 3 డాక్యుమెంట్లను విచారణలో సదరు ఓటర్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ యొక్క 11 డాక్యుమెంట్లు ఏమేమి అని క్షుణ్ణంగా వివరించారు. కొత్తగా ఏర్పాటు చేసినటువంటి 84 పోలింగ్ కేంద్రాలకు బూతులు ఏజెంట్ యొక్క వివరములను సమర్పించాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. పూర్తిగా నడవలేని వారు, హాస్పిటల్లో ఉన్నవారు మరియు వికలాంగులు వారికి వర్చువల్ ద్వారా ఏరియా కండక్ట్ చేయడం జరుగుతుందని, మిగిలిన ఓటర్లు అందరూ కూడా ఎవరైతే నోటీసులు తీసుకున్నారు వారు ఫిజికల్ గా అటెండ్ కావాలని తెలిపారు. ఇప్పటివరకు పంపిణీ చేసినటువంటి నోటీసుల యొక్క వివరములు మరియు బ్యాలెన్స్ వివరములను వివరించారు. రాజకీయ పార్టీ ప్రతినిధిలో సలహాలు, సూచనలను స్వీకరించి, పలు సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, తహసిల్దార్ సురేష్ బాబు, ఎన్నికల ఉప తహసిల్దారు సుధాకర్ నాయక్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితాను రూపొందించాలి




## జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ చేతన్ టి.ఎస్.

## ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా చేపడుతున్నాం : జేసీ డా. నిధీమీనా

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026)లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా, స్వచ్ఛంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ చేతన్ టి.ఎస్. ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు.కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ లో గురువారం ఎస్ఐఆర్2026 లో భాగంగా జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ చేతన్ టిఎస్... జిల్లా జేసీ డా. నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ చేతన్ టిఎస్ మాట్లాడుతూ... ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమీషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్ల నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదులో వివరాలు.పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటిస్తే తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల జాబితాని పరిశీలన చేయాలని, బిఎల్వోలకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలని, క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జేసీ డా. నిధీమీనా జిల్లాలో ఎస్.ఐ. ఆర్. నిర్వహణ గురించి వివరిస్తూ... జిల్లాలో మొత్తం 18,96,231 మంది ఓటర్లు ఉండగా, జూలై 24 నాటికి 64,434 మంది (3.40 శాతం) మ్యాపింగ్ కాని ఓటర్లు, 2,43,180 మంది (12.82 శాతం) మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లు ఉన్నట్లు జేసీ డా. నిధీమీనా తెలిపారు. కడప నియోజకవర్గంలో అత్యధికంగా 25,538 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు ఉన్నారని వివరించారు. ఆగస్టు 20 నాటికి 3,07,685 నోటీసులను 100 శాతం జనరేట్ చేశామని, ఎక్కడా పెండింగ్ లేదని తెలిపారు. జిల్లాలోని 2,251 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బీఎల్ఓబీఎల్ఏ సమావేశాల మినిట్స్ కూడా పూర్తిగా అప్‌లోడ్ చేశామని వెల్లడించారు.ఫారాలు 9, 10, 11, 11ఏ, 11బీ ప్రచురణ అనంతరం ఏడు రోజుల నోటీసు గడువు ముగిసిన వెంటనే ఫారాలు 6, 6ఏ, 7, 8 పరిష్కార ప్రక్రియ చేపట్టాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ చేతన్ టి.ఎస్. సూచించినట్లు జేసీ తెలిపారు. సెప్టెంబర్ 21లోపు నోటీసుల ప్రక్రియ, సెప్టెంబర్ 28లోపు విచారణలు, తుది ఉత్తర్వులు పూర్తి చేయాలని సూచించినట్లు వివరించారు. అలాగే ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించి, బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా వచ్చిన 3,162 ఫిర్యాదుల్లో 3,098 మూసివేసి, 49 పరిష్కరించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా 2,251 కేంద్రాలను 2,444కు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, కొత్తగా 193 కేంద్రాల ఏర్పాటు, 20 కేంద్రాల మార్పు, 20 కేంద్రాల పేర్ల మార్పునకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని జేసీ డా. నిధీమీనా వివరించారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్ తో 2 గేదెలు మృతి... ఆదుకోవాలని బాధితులు ఆవేదన.

### విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ.. స్థానిక ప్రజల మండిపాటు. ప్రభుత్వం ఆదుకోవాలని బాదిత సంగయ్యపేట బడేబి కుటుంబం ఆవేదన.

**నందికొట్కూరు ఆగష్టు 20( నంది పత్రిక)** విద్యుత్ షాక్ గురై రెండు గేదెలు మృతి చెందిన ఘటన గురువారం నందికొట్కూరు పట్టణం పగిడాల రోడ్డు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహముకి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కరెంట్ స్థంబాలు తీగల క్రిందికి ఉండి మరికొన్ని తెగిపోయి కిందపడి స్థలంలో ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు పట్టణంలోని సంగయ్య పేటకు చెందిన బడేబి భర్త (మహమ్మద్ సా ) తనకు గల బర్రెలను(గేదెలు )మేపుకో వడానికి పచ్చికబ్బయలకు బయలుదేరింది. పచ్చిక బయలను మెస్తూ కిందపడి ఉన్న విద్యుత్ కలిగి ఉన్న తీగలకు గేదెలు తగలగా అవి అక్కడికక్కడే మృతి చెందాయి. తన కళ్ళ ముందే చూసిన ఘటన నుండి తేరుకున్న మహిళ బడేబి ప్రమాదం నుంచి తప్పించుకుంది. చనిపోయి పడి ఉన్న గేదెల వద్ద ఆమే నిరోధన పలువురిని కలిచి వేసింది. ఈ సందర్భంగా ఆమె కుమారుడు చాంద్ బాషా మాట్లాడుతూ తన తల్లి గేదెలను మెపు కోవ డానికి వెళ్లిందని , క్రింద పడి ఉన్న తీగలను గేదలు తగిలి విద్యుత్ షాక్ గురై మృతి చెందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, జీవనాధారమైన గేదెలు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల మృత్యువాత పడడం తాము జీర్ణించుకోలేకపోతున్నాని వారు కన్నీటి పర్యంతమయ్యారు. తృటిలో తన తల్లి విద్యుత్ తీగల ప్రమాదం నుంచి తప్పించుకుందని ఆయన వాపోయారు. స్తంభాలకు గల విద్యుత్ తీగల కొన్ని క్రిందికి వేలాడడం మరికొన్ని తీగల క్రింద పడి ఉండడం ఇది ముమ్మాటికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు గల 80 వేల విలువచేసే గేదలు మృతి చెందాయని, సంబంధిత అధికా రులపై చర్యలు తీసుకొని, తమని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన వేడుకున్నారు.



**విద్యుత్ అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు : రైతు.** ఘటన సమీపంలో ఉన్న వ్యవసాయ భూమి ఉన్న రైతు పల్మార్లు విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు క్రిందికి వేలాడి ఉన్నాయని చెప్పిన ఎవరు స్పందించకపోవడమే ఈ దుర్ఘటనకు కారణమన్నారు. ముమ్మాటికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, నష్టపోయిన బాధ్యత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

# నోటీసుల పంపిణీ పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి



### ఓటర్ల కు సౌలభ్యం కల్పించేందుకు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 20(నంది పత్రిక):–** : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సార్) ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ విచారణ,ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, క్లెయిమ్ ల పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిగా జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.... ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నోటీసుల పంపిణీ విచారణ క్లెయిమ్ లు మరియు అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఫారం 6,7,8 ద్వారా వచ్చిన క్లెయిమ్స్ అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

నోటీసుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిగా పరిష్కరించాలన్నారు. ఎక్కువ పెండింగ్ ఉన్న నియోజకవర్గాలు పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నోటీసుల జనరేటర్ పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి మ్యాపింగ్ కానీ ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జూలై 1 వ తేదీ నాటికి 18 ఏళు పూర్తయిన యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు కళాశాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఆగస్టు 22, 23, 29 మరియు 30 తేదీలలో (స్పెషల్ కాంపెయిన్ డేస్ ) ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించాలని తెలిపారు. బి ఎల్ ఓ లు కాల్స్ కు బుక్ చేసుకున్న ఓటర్ల అభ్యంతరాలు నిర్ణీత సమయంలోపు స్పందించి పరిష్కరించాలన్నారు. ఎన్ జి ఎస్పీ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సార్ ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సార్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి దశను గడువు లోపు పూర్తి చేస్తామని తెలిపారు.నోటీసుల పంపిణీ కి సంబంధించి శ్రీశైలం నియోజకవర్గంలో పెండింగ్ ఉందని గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఫారం 6 సంబంధించి దరఖాస్తులు అధిక సంఖ్యలో వచ్చినప్పటికీ ప్రత్యేక క్యాంపులు నిర్వహించి సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. బి ఎల్ ఓ ల కు సంబంధించిన 9 కాల్స్ పెండింగ్లో ఉండగా వాటిల్లో రెండు 48 గంటలు దాటాయనీ వాటిని కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్ జి పీ ఎస్ ఫిర్యాదులు పెండింగ్లో లేవని తెలిపారు. 80283 నోటీసులు జనరేట్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన నోటీసుల ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. శ్రీశైలం నియోజకవర్గం నోటీసుల పంపిణీ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ప్రక్రియ సజావుగా జరగాలని సిఈఓ సూచించగా అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ ఓ రాము నాయక్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సబ్సిడీ బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం



**నంద్యాల బ్యూరో, ఆగష్టు20(నంది పత్రిక):–** నంద్యాల జిల్లాలో సామాన్య, నిరుపేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి వినియోగ దారులకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఆద్వర్యంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ నంద్యాల వారు తెలిపారు. జిల్లాలోని 6 మండల కేంద్రాలలో నంద్యాల పట్టణం లో రెండు శ్రీనివాస నగర్ లోని రైతు బజార్ & నూనెపల్లి లోని వ్యవసాయ మార్కెట్ కమిటి నందు (2) , ఆళ్లగడ్డ , ఆత్మకూరు, బనగానపల్లి మరియు నందికొట్కూర్ కేంద్రాలలో బియ్యం ప్రతేక కౌంటర్ లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రతేక కౌంటర్ ల ద్వారా స్టీమ్ బియ్యం (బీపీటీ) కిలో రూ.52 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ. 62 రూపాయలు ఉంది), రా (ముడి ) బియ్యం (బీపీ టీ) కిలో రూ. 50 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ.58 చొప్పున విక్రయిస్తున్నారని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ తెలిపారు. గురువారం నంద్యాల నూనెపల్లి లోని వ్యవసాయ మార్కెట్ కమిటి షాపింగ్ కాంప్లెక్స్ నందు రెండొవ బియ్యం తగ్గింపు ధరల విక్రయ కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ గుంటుపల్లి హరిబాబు మరియ ఎన్ఎండి ఫిరోజ్ గారు మరియు నంద్యాల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ విశ్వనాథ గారు మరియు జిల్లా పౌర సరఫరాల అధికారి జ్యోతి రవిబాబు గారు ముఖ్య అతిథులుగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్టీమ్ బియ్యం (బీపీటీ) కిలో రూ.52 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ. 62 రూపాయలు ఉంది). రా బియ్యం (బీపీ టీ) కిలో రూ. 50 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ.58 రూపాయలుగా ఉంది). ఈ సబ్సిడీ బియ్యం పథకం ఆధార్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వర్తిస్తుందని తెలిపారు. బియ్యం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు తమ ఆధార్ నంబరును తప్పనిసరిగా తెలియజేయాలని, ఒక బియ్యం ఆధార్ కార్డుకు నెలకు గరిష్టంగా 10 కిలోల బియ్యం మాత్రమే అందజేయబడుతుందని అన్నారు. నంద్యాల జిల్లాలోని 6 మండల కేంద్రాలలో నంద్యాల పట్టణం లో రెండు శ్రీనివాస నగర్ లోని రైతు బజార్ & నూనెపల్లి లోని వ్యవసాయ మార్కెట్ కమిటి నందు (2), మరియు ఆళ్లగడ్డ , ఆత్మకూరు, బనగానపల్లి మరియు నందికొట్కూర్ కేంద్రాలలో గుర్తించిన రైస్ మిల్ అవుట్లెట్లలో బియ్యం ప్రతేక కౌంటర్ లను ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేయకూడదని అన్నారు. నిబంధనలకు లోబడి అత్యంత నాణ్య మైన బియ్యాన్ని మాత్రమే విక్రయించాలని లేదంటే కఠిన చర్యలు ఉంటాయిని తెలిపారు. విక్రయ కేంద్రం వద్ద ధరల పట్టిక, స్టాక్ వివరాలు, పని వేళలు స్పష్టంగా ప్రదర్శించాలని వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్టాక్ నిరంతరం అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల జిల్లా సివిల్ సప్లైస్ అధికారి జ్యోతి రవిబాబు, నంద్యాల ఆర్డీవో చల్లా. విశ్వనాధ్, తహసీల్దార్ అర్బన్ శ్రీనివాసులు, నంద్యాల రూరల్ తహసీల్దార్ శ్రీవాణి, ది నంద్యాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ -2 ప్రతినిధులు, శేఖర్ రెడ్డి ఉప తహశీల్దార్ (సివిల్ సప్లైస్) అధికారులు, రైతుబజార్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డ ఆర్టిసి డిపో అధికారుల నిజాయితీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 20 నంది పత్రిక** ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం భద్రత ఉంటుందని ఆ సంస్థ ఉద్యోగులు రుజువు చేశారు. ఆళ్లగడ్డ నుండి మైదుకూరు కు వెళ్లే బస్సు సర్వీసులో ఈనెల 19న లక్ష్మీదేవి అనే ప్రయాణికురాలు ఎక్కారు. బస్సు దిగే క్రమంలో మనీ పర్సు, అందులో సెల్ ఫోన్ ఉన్న పర్సును మర్చిపోయారు. బస్సు డ్రైవర్, కండక్టర్ మనీ పర్సును సెక్యూరిటీ విభాగంలో అప్పగించారు. అధికారులు పర్సులోని ఆధారాల ద్వారా పర్సు,మొబైల్ ను గురువారం అప్పగించారు.

## కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చెయ్యాలి

### ఆళ్లగడ్డలో న్యాయవాదుల నిరసన.




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 20 నంది పత్రిక** కర్నూలు నగరంలో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆళ్లగడ్డ లో గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివరామిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో గత ప్రభుత్వం హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా హైకోర్టు బెంచి ఏర్పాటుపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయకపోతే న్యాయవాదుల సత్తా చూపిస్తామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు బార అసోసియేషన్ సెక్రటరీ గోపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు బి నీలకంతేశ్వరం, పి సూర్యనారాయణ రెడ్డి , జనార్ధన్, వెంకటరమణ, మురళీధర్ బాబు, తిమ్మయ్య, మాదం రవి, జాయింట్ సెక్రటరీ షాహిన, ట్రెజరర్ శ్రావణి, దాదా పీర్ , జాయింట్ సెక్రటరీ వెంకటయ్య, బాబా ఫక్రుద్దీన్, గోడిగనూరు శేఖర్, తొమ్మంద్రు వినోద్ కుమార్, డిసి విజయ్, చాణక్య శ్రీనివాసులు , ఎన్ మురళీమోహన్, హరి తదితరులు పాల్గొన్నారు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివరామిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో గత ప్రభుత్వం హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా హైకోర్టు బెంచి ఏర్పాటుపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయకపోతే న్యాయవాదుల సత్తా చూపిస్తామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు బార అసోసియేషన్ సెక్రటరీ గోపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు బి నీలకంతేశ్వరం, పి సూర్యనారాయణ రెడ్డి , జనార్ధన్, వెంకటరమణ, మురళీధర్ బాబు, తిమ్మయ్య, మాదం రవి, జాయింట్ సెక్రటరీ షాహిన, ట్రెజరర్ శ్రావణి, దాదా పీర్ , జాయింట్ సెక్రటరీ వెంకటయ్య, బాబా ఫక్రుద్దీన్, గోడిగనూరు శేఖర్, తొమ్మంద్రు వినోద్ కుమార్, డిసి విజయ్, చాణక్య శ్రీనివాసులు , ఎన్ మురళీమోహన్, హరి తదితరులు పాల్గొన్నారు

## మద్దిలేటి నరసింహా స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా క్రిష్టిపాడు చంద్ర ఎంపిక




**నందిపత్రిక –ప్యాపిలి** ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డు) సభ్యుడిగా ప్యాపిలి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు క్రిష్టిపాడు చంద్ర ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ శాఖ గురువారం అధికారికంగా జీవో 1482) విడుదల చేసింది. చంద్ర మాట్లాడుతూ ఆలయ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మెరుగైన వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తన ఎంపికకు సహకరించిన పవన్ కళ్యాణ్ కు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ లకు ప్రజాప్రతినిధులకు, దేవాదాయ శాఖ అధికారులక నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు చంద్ర ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల స్థానిక నాయకులు, గ్రామస్తులు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ పై ప్రభుత్వ నిర్ణయం హర్షనియం : గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు.

**నందికొట్కూరు ఆగష్టు 20(నంది పత్రిక )** ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34% రిజర్వేషన్ అమలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయాత్మకమైన అడుగు వేయడం స్వాగతిస్తూ హర్షించదగిన విషయమని సామాజిక కార్యకర్త వాల్మీకి బోయ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన పత్రిక ప్రకటన మాట్లాడుతూ సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలు బీసీలు అని దేశ జనాభాలో అగ్ర భాగం బీసీలే నన్నారు. జనాభా ప్రతిపదికన సామాజిక రాజకీయ న్యాయం పొందడంలో అన్ని రాజకీయ పార్టీలో ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యం చేశారన్న విషయాన్ని గుర్తు చేశారు. విద్య ఉపాధి, రాజకీయ, వైద్యం, ఆర్థిక రంగాలలో వెనుకబాటుతనాన్ని గమనించి ఏపీ ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలలో అన్ని వర్గాల అభివృద్ధి కి అనుగుణంగా 34% రిజర్వేషన్ అమలు చేయాలనే నిర్ణయం బీసీల భవిష్యత్ కు ఎంతో శుభ పరిణామం అన్నారు. మహిళలకు కూడా 33% రిజర్వేషన్ అమలు చేయడం గొప్ప నిర్ణయం అని కొనియాడారు. బీసీలకు రిజర్వేషన్ అనేది కేవలం ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మాత్రమే కాదని సామాజిక మార్పుకు ఒక బలమైన వేదికని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై ఆయన స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలిపారు.



## ఏబీవీపీ బేతంచెర్ల నూతన నగర కమిటీ ఎన్నిక.



**బేతంచెర్ల ఆగస్టు 20 ( నంది పత్రిక )** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ బేతంచెర్ల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కర్నూల్ విభాగ్ కన్వీనర్ యుగంధర్ తెలిపారు నగర కార్యదర్శిగా విజయ్ , సహా కార్యదర్శిగా సూర్య తేజ, మహేష్, శేఖర్ , దేవేంద్ర లను నియమించారు ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతు ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నుంచి నేటి వరకు లక్షలాదిమంది విద్యార్థులను జాతీయ భావం వైపు నడిపిస్తూ, ఎక్కడ విద్యార్థులకు అన్యాయం జరిగిన ముందుండి పరిష్కరిస్తూ విద్యార్థులకు అండగా నిలుస్తూ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా నిలిచిందని తెలిపారు నూతన కార్యకర్తలు అందరూ అనునిత్యం విద్యార్థులతో కలిసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరగాలి.. ఏపీ రైతు సంఘం



**కొలిమిగుండ్ల ఆగష్టు 20 నందిపత్రిక** కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేట గ్రామంలో విద్యుత్ ఐ పవర్ లైన్ కు భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో రైతులకు అన్యాయం జరుగుతుందని ఇందుకు రైతుల పక్షాన పోరడేందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రైతులతో జనరల్ బాడీ సమావేశం ఎం సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి గారు, నంద్యాల జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు రామచంద్రుడు, రాజశేఖర్ గారు మరియు సిఐటియు జిల్లా నాయకులు బాలవెంకట్, రైతు సంఘం జిల్లా నాయకులు సుబ్బరాయుడు, సురేష్,ప్రసాద్ మరియు బాధిత రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

### 20 ద్విచక్ర వాహనాలు గుర్తింపు జరిమానాలు విధింపు.

### విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు నుండి మౌర్య ఇన్ మధ్యలో ఉన్న చైతన్య కళాశాల సమీపంలో గురువారం మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు నడుపుతున్న 20 ద్విచక్ర వాహనాలను గుర్తించి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. వీటిలో కొన్ని అధిక సీసీ సామర్థ్యం కలిగిన వాహనాలు ఉన్నాయి.మైనర్ విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, వారికి ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని, రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కర్నూలు ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం బ్యూరో చీఫ్, ఆగస్టు 20 నంది పత్రిక** గ్రామపంచాయతీలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవో లు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ ఎంపీడీవోల తో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, పరిశీలన తదితర ప్రక్రియలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామపంచాయతీల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించి, వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా అలసత్వానికి తావులేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి ప్రభాకర్,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ సీఈవో పి .జగదాంబ, జిల్లా పంచాయతీ అధికారి కె .అనురాధ తదితర అధికారులు పాల్గొన్నారు.

## దిండి-చించినాడ వారధిపై భారీ వాహనాలకు అనుమతి

**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక**

చించినాడ వశిష్ఠ వారధిపై భారీ వాహనాల రాకపోకలకు బుధవారం రాత్రి 8 గంటల నుంచి రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఎన్ హెచె ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వి వెంకటరమణ చెప్పారు. వారధికి బేరింగుల మార్పు తదితర మరమ్మతుల నేపథ్యంలో గత సంవత్సరం జులై నుంచి భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించడం జరిగిందన్నారు. అప్పటినుండి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మాత్రమే తిరుగుతున్నాయన్నారు. వారధిపై ఆంక్షల కారణంగా అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య రవాణా, ప్రయాణాలకు ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వారధికి పాడైన బేరింగులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే ప్రక్రియ ఈ ఏడాది మార్చి 12 నుంచి ప్రారంభించి నాలుగు నెలల వ్యవ ధిలో బేరింగులు మార్పు, ఇతర మరమ్మత్తులు పూర్తి చేయడం జరిగిందన్నారు. గుంతలను పాలిమర్ కాంక్రీటుతో సరి చేసి రాకపోకలకు అనుమతించడం జరిగిందని ఏ ఈ వెంకటరమణ తెలిపారు.

## దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన ర్యాలీ



**బద్వేల్, ఆగస్ట్ 20:(నంది పత్రిక )** దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన ర్యాలీ కల్పించడమైనది. బద్వేల్ పట్టణంలోని, గురువారం తొట్టిగారి పల్లె పిహెచ్సి, సురేంద్ర నగర్, గాంధీనగర్, కోటవీధి యూపీహెచ్సీ లలో ప్రపంచ దోమల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వైద్య అధికారులు, వైద్య సిబ్బంది ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమం బ్యానర్ చేతపట్టి ,పలు వీధులలో ర్యాలీ .దోమ పుట్టకూడదు, కుట్టకూడదు, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలంటూ నినాదాలు చేయడంతో పాటు ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు రాజేష్ కుమార్, శ్రీనివాసులు, శరత్ చంద్రాలు మాట్లాడుతూ, 1897 ఆగస్టు 20వ తేదీన బ్రిటిష్ వైద్యులు సర్ రోనాల్డ్ దాస్ ఆడనాఫిలిస్ దోమ ద్వారానే మలేరియా వ్యాధి వస్తుందని కనుగొనడం జరిగిందన్నారు. మలేరియా వ్యాధిని కనుగొన్నందుకు, అప్పుడున్న ప్రభుత్వం 1902 లో ప్రతిష్టాత్మకమైన నోబుల్ బహుమతి అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆగస్టు 20వ తేదీన ప్రపంచవ్యాప్తంగా దోమలను దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. సబ్ యూనిట్ అధికారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ, దోమలు గుడ్లు పెట్టకుండా లార్వాదశలోనే నివారించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి వెంగయ్య మాట్లాడుతూ ప్రతి రోజు లార్వా, ఫీవర్, కరోనాలపై వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. 104, 108 ద్వారా ఇండ్ల వద్దకే వైద్యం అందుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చంద్రావతి ,పారామెడికల్ అధికారి శంభు ప్రసాద్, గాంధీనగర్ యుపిఎస్సి శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్ధన్, రావు సొద్దల శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులు ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలకు సంబంధించి జీఎస్టీ చెల్లించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం, బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక** జిల్లాలోప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు సంబంధించి జి.ఎస్.టి చెల్లించన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రవేట్ రంగ సంస్థ నుండి జి.ఎస్.టి చేల్లింపులపై వాణి జ్య పనుల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమా వేశంనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయి తీరాజ్, గ్రామ పంచాయతీల నుండిచెల్లింపులు చేసిన జి.ఎస్.టి వివరాలను ప్రతినెల వాణిజ్య పనులను శాఖ అధికారులకు అందజేయాలని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలకు సంబంధించి జి.ఎస్.టీ చెల్లించిన వారిపై కేసుల నమో దు చేయాలని అధికారులకుకలెక్టర్ చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వాణిజ్య పనుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి. సాంబశివరావు, జాయింట్ కమిషనర్ నాగార్జున రావు, డిప్యూటీ కమిషనర్ శైలజ శ్రీ తదితరులు పాల్గొన్నారు.------ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయం భీమవరం నుండి జారీ చేయడమైనది.

## జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**విజయవాడ, బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక**జనహితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. జర్నలిస్టుల అత్యవసర అవసరాల కోసం రూ.2.5 లక్షలు అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ ఏఈ అసోసియేషన్ హాల్లో గురువారం నిర్వహించిన ప్రజా ప్రెస్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో జర్నలిస్టులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రెస్ క్లబ్ ఏడాది కాలంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులోనూ ప్రెస్ క్లబ్ మరింత అభివృద్ధి చెంది జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

**అత్యవసర నిధికి రూ.2.5 లక్షలు**జర్నలిస్టుల సంక్షేమం పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుతూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు జర్నలిస్టుల అత్యవసర నిధికి రూ.2.5 లక్షలు ప్రకటించారు. జర్నలిస్టులు ప్రమాదాల్లో గాయపడినప్పుడు, జర్నలిస్టు మిత్రుల కుటుంబాల్లో ఎవరైనా మరణించినప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఈ నిధి ద్వారా తక్షణ సహాయం అందించాలని సూచించారు. జర్నలిస్టు మిత్రులకు అన్ని సమయాల్లో అండగా ఉంటానని, అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జర్నలిస్టుల అత్యవసర నిధికి ఎమ్మెల్యే నిధులు కేటాయించడం పట్ల ప్రజా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ వసంత కృష్ణప్రసాదు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రాజీవ్ గాంధీ 83వ జయంతి వేడుకలు




**ఏలూరు బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక:** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 83వ జయంతి సందర్భంగా ఏలూరు సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బురదగుంట లెవిన్ క్రిస్టియన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రోగులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ గారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు, ముఖ్యంగా అవసరంలో ఉన్నవారికి సేవ చేయడం తమ బాధ్యత అని యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సిటీ యూత్ కాంగ్రెస్ సభ్యులు కప్పల చిన్నబాబు, వుట్టల సునీల్, ఇసాపురి కిరణ్, బురదగుంట హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం





**నంద్యాల బ్యూరో, ఆగస్టు 20(నంది పత్రిక):-** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సార్) ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో డి ఆర్ ఓ రాము నాయక్ సమావేశం నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సమావేశం జరిగింది. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అంశాలను వివరించారు. డి ఆర్ ఓ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలు, తుది ప్రచురణ తదితర అంశాలపై సమీక్షిస్తూ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 80,283 నోటీసులు జనరేట్ చేయగా, ఇప్పటివరకు 70,615 నోటీసులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇంకా 9,668 నోటీసులు పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే 12,142 విచారణలు పూర్తయ్యాయని, 57,473 విచారణలు పెండింగ్‌లో ఉన్నాయని, 12,587 కేసులు తుది ప్రచురణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 30, 2026 వరకు అందిన క్లైయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ లు) సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పెండింగ్ ఫిర్యాదులు, 'బుక్ ఎ కాల్ విత్ బి ఎల్ ఓ లు ' అంశాలపై కూడా సమావేశంలో సమీక్షించారు.

## రక్త వర్గ నిర్ధాణ పరీక్ష మరియు అవగాహన కార్యక్రమం




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 20 నంది పత్రిక** ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా ఎన్ఎస్ఎస్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నాడు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్త వర్గ నిర్ధారణ పై అవగాహన కార్యక్రమ జరిగింది, ఈ కార్యక్రమం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించారు.ఏపీ ఎస్ ఏ సి ఎస్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ ఎన్ ఎస్ వర్ధనాచారి కళాశాల సిబ్బందితో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్త వర్గ ప్రాముఖ్యత రక్తదానం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి 52 మంది విద్యార్థులు తమ రక్త వర్గాలను పరీక్షించుకున్నారని తెలిపారు.

## రాయలసీమ లో కరవు ఛాయలు

### శ్రీశైలంలో నీరున్న ఎస్ ఆర్ బి సి కాల్వకు నీరు వదలని ప్రభుత్వం

### గాలేరు నగరి ద్వారా అవుకు రిజర్వాయర్ చేరిన నీరు

### పరిశ్రమలకు అమ్ముకుంటున్న ప్రభుత్వం

### రాయలసీమ మంత్రులు చేతగాని మంత్రులు

### మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే



**బనగానపల్లె ఆగష్టు 20నందిపత్రిక** రాయలసీమ లో కరువు ఛాయలు ఆలముకున్నాయి. శ్రీశైలం డ్యామ్ లో నీరున్న ఈ ప్రభుత్వం రైతులకు నిరీవ్వడం లేదు ఇక్కడి రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్న కూటమి ప్రభుత్వం లో ఉన్న రాయలసీమ మంత్రులు . ఇక్కడి రైతుల దయనీయ పరిస్థితి పై నోరు మేద పడం లేదు. అయితే మేము ఈ పరిస్థిని చూస్తూ ఊరుకోమని రైతులతో అవుకు రిజర్వాయర్ ను ముట్టడిస్తామని మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నుండి రైతులకు సాగునీరు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయం పై ధ్వజమేత్తారు. రైతుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న కూటమి ప్రభుత్వం.శ్రీశైలం డ్యామ్ లో 875 అడుగులకు నీరు చేరిన ఎస్ ఆర్ బి సి కాలువకు నీరు అందించలేని ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఒకవైపు గాలేరు - నగరి ద్వారా అవుకు రిజర్వాయర్ కు నీరు విడుదల చేస్తున్నారు ఆ నీటిని అవుకు రిజర్వాయర్ నుంచి సిమెంట్ పరిశ్రమలకు మళ్లిస్తున్నారు.రైతులకు సాగు నీరు లేదు కానీ పరిశ్రమలకు మాత్రం నీరు ఇస్తూ కొత్త సాంప్రదాయానికి తెరలేపుతున్నదీ ప్రభుత్వం.కనీసం ఆరుతడి పంటలకు కూడా నీరు అందించలేని చేతకాని ప్రభుత్వం ఇది. ఈ కరువు పరిస్థితి లో ఈ ప్రాంత వాసులకు నీటి కోసం గొంతెత్తని నంద్యాల జిల్లా లోని మంత్రులు,శాసన సభ్యులు ఒకసారి .. రైతుల కన్నీళ్లు చూడండి జిల్లాలోనీ మంత్రులు ఏం చేస్తున్నారు అన్నారు..ఒకవైపు ఎరువుల ధరలు పెరిగాయి...రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు దింతో వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడని తక్షణమే ఎస్ ఆర్ బీసి కి నీరు వదిలి రైతులను ఆదుకోవాలని కోరారు.కార్యక్రమం లో అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి,వైఎస్సార్సీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి,గడ్డం బాషా తదితరులు పాల్గొన్నారు.



# పహలే ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిడిడిపి, జిఎండిపి, కేపిఐ ఎస్ పై కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ

**జిల్లా ఆర్థికాభివృద్ధి, నియోజకవర్గాల ఆర్థిక ప్రొఫైలింగ్ కు ప్రాధాన్యత**

**డేటా ఆధారిత ప్రణాళికలతో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ - 2047 లక్ష్యాల సాధన. ప్రణాళికా శాఖ ప్రత్యేక కార్యదర్శి, శాంతి ప్రియ పాండేలి,**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్, ఆగస్టు 20, నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించడం, జిల్లాలోని వివిధ రంగాల ఆర్థిక స్థితిగతులను సమగ్రంగా విశ్లేషించడం, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి అవకాశాలను గుర్తించడం లక్ష్యంగా జిల్లా స్థాయి సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తునామని ప్రణాళికా శాఖప్రత్యేక కార్యదర్శి శాంతి ప్రియ పాండే పేర్కొన్నారు.స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్2047 లక్ష్యాలకు అనుగుణంగా జి డి డిపి జిఎం డిపి కే పి ఎల్ ఎసో పాటు జిల్లా, నియోజకవర్గాల ఆర్థిక ప్రొఫైలింగ్ అంశాలపై గురువారం కలెక్టరేట్ లోని వశిష్ఠ సమావేశ మందిరంలో పహలే ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమం ఆగస్టు 14వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు కొనసాగు తుందని అన్నారు. ఈ శిక్షణలో జిల్లాలోని వ్యవసాయం, ఆక్వాకల్చర్, పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సేవారంగం, వాణిజ్యం, మౌలిక వసతులు, ఉపాధి, పెట్టుబడులు తదితర రంగాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో విశ్లేషించడం, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు ఉపయోగపడే విధంగా ఆర్థిక సూచికలను రూపొందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

**శిక్షణ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రణాళికా శాఖప్రత్యేక కార్యదర్శి శాంతి ప్రియ పాండే మాట్లాడుతూ** జిల్లా స్థూల దేశీయ ఉత్పత్తి ద్వారా జిల్లాలోని వివిధ ఆర్థిక రంగాల పనితీరును అంచనా వేయడం, జిల్లాకు ఆర్థికంగా అత్యధికంగా దోహదపడుతున్న రంగాలను గుర్తించడం, వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలను రూపొందించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని అన్నారు.జీఎండీపీ, కేపీఐఎస్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కొలవడం, శాఖల వారీగా నిర్దిష్ట లక్ష్యాలను నిర్ధారించడం, లక్ష్యాల సాధనను నిరంతరం పర్యవేక్షించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులకు వివరించారు.అభివృద్ధి ఫలితాలను గణాంకాల ఆధారంగా అంచనా వేసేందుకు ఖూ×ం కీలకంగా ఉపయోగపడుతుందని అన్నారు.జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక ఆర్థిక ప్రొఫైల్ రూపొందించడం ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న వనరులు, మానవ వనరులు, ప్రధాన ఆర్థిక కార్యకలాపాలు, పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఉపాధి అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు, మౌలిక వసతుల అవసరాలను గుర్తించవచ్చు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, సరైన డేటాను సేకరించడం, విశ్లేషించడం ద్వారా జిల్లాకు అవసరమైన ప్రాధాన్యతా రంగాలను గుర్తించవచ్చాన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్2047 లక్ష్యాల సాధనలో జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన వ్యవసాయ జిల్లా అని అన్నారు. సారవంతమైన గోదావరి డెల్టా భూములు, విస్తారమైన నీటిపారుదల వ్యవస్థ, ఆక్వాకల్చర్, ఉద్యానవన పంటలు, వ్యవసాయ ఆధారిత కార్యకలాపాలు, అభివృద్ధి చెందుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ జిల్లాకు ప్రధాన వనరులుగా ఉన్నాయని అన్నారు. జిల్లా 2,278.35 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, సుమారు 18.44 లక్షల జనాభా కలిగి ఉండగా, 3 రెవెన్యూ డివిజన్లు, 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, 20 మండలాలు ఉన్నాయన్నారు. జిల్లా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. 202526 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.74,023 కోట్ల జిడిడిపి నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. జిల్లా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం 48.45 శాతం, సేవారంగం 37.48 శాతం, పారిశ్రామిక రంగం 14.07 శాతం వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఈ గణాంకాలను ఆధారంగా చేసుకుని భవిష్యత్‌లో అధిక వృద్ధి సాధించగల రంగాలను గుర్తించి, వాటికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, ఆక్వా, ఉద్యానవనం ప్రధాన వనరులు అన్నారు.సారవంతమైన డెల్టా భూములు, నిరంతర నీటిపారుదల సౌకర్యాలు, అనుకూల వాతావరణ పరిస్థితులు జిల్లాలో వైవిధ్యభరితమైన వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. వరి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలతో పాటు ఆయిల్‌పామ్, కోకో, మామిడి, కొబ్బరి, కూరగాయలు, అధిక విలువ కలిగిన ఉద్యానవన పంటలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో మంచినీటి చేపల పెంపకం, ఉప్పునీటి ఆక్వాకల్చర్, తీరప్రాంత ఆక్వాకల్చర్, అనుబంధ కార్యకలాపాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. కాలువలు, రిజర్వాయర్లు, నీటి వనరులు మత్స్యరంగ అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. ఆక్వాకల్చర్ గ్రామీణ జీవనోపాధి, ఉపాధి, ఎగుమతులకు గణనీయంగా దోహదపడుతున్న నేపథ్యంలో చేపల ప్రాసెసింగ్, కోల్డ్‌చైన్, నిల్వ, ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతి సౌకర్యాలను బలోపేతం చేయడం ద్వారా మరింత వృద్ధిరేటు సాధించవచ్చని అన్నారు. కోకో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్, రైస్ మిల్లింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఎం ఎస్ ఎం ఈ ల అభివృద్ధికి జిల్లాలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులను కేవలం ముడి సరుకుగా విక్రయించకుండా స్థానికంగానే ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం, యువతకు మరింత ఉపాధి, జిల్లాకు అదనపు ఆర్థిక విలువ లభిస్తాయని అన్నారు.




జిల్లాలో పర్యావరణ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటకానికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాకు సుమారు 19 కిలోమీటర్ల సముద్ర తీరం, 57 కిలోమీటర్ల గోదావరి నది ప్రవాహం ఉండటం బోటింగ్, బీచ్, రివర్ టూరిజం అభివృద్ధికి అనుకూల వాతావరణం ఉందని అన్నారు. పాలకొల్లులోని శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం, భీమవరంలోని శ్రీ సోమేశ్వర స్వామి జనార్దన స్వామి ఆలయం, పెనుగొండలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలను అనుసంధానం చేస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలోపేతం చేకూరుతుందని అన్నారు. జిల్లా ఆర్థిక వ్యవస్థకు అత్యధికంగా దోహదపడుతున్న రంగాలను ఎలా గుర్తించాలి, ఆయా రంగాల వృద్ధికి అవసరమైన చర్యలను ఎలా రూపొందించాలి అనే అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని వివిధ శాఖల వద్ద అందుబాటులో ఉన్న అధికారిక గణాంకాలను సమగ్రంగా క్రోడీకరించి, వాటిని విశ్లేషించి, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు వినియోగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సరైన డేటా సేకరణ, డేటా విశ్లేషణ, శాఖల మధ్య సమన్వయం, ప్రాధాన్యతా రంగాల గుర్తింపు, పెట్టుబడుల అవకాశాల మ్యాపింగ్ తదితర అంశాల ద్వారా డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అధికారులు మెరుగుపరుచుకోవాలన్నారు. బోటింగ్, బీచ్, రివర్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఈకో టూరిజాన్ని సమన్వయం చేస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచవచ్చని తెలిపారు. జిల్లాకు ఉన్న వ్యవసాయ వనరులు, నీటిపారుదల మౌలిక సదుపాయాలు, ఉద్యానవన అవకాశాలు, ఆక్వాకల్చర్, మానవ వనరులు, పారిశ్రామిక సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించుకుంటే జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామి ఆర్థిక కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్2047కు అనుగుణంగా సమగ్ర, సమతుల్య, పర్యావరణహిత అభివృద్ధిని సాధిస్తూ జిల్లాలో సుమారు 15 శాతం వృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో సిపిఓ శివ పార్వతి, పహెల్ ఇండియా ఫౌండేషన్ శిక్షకులు డాక్టర్ ఎండి పైజాన్, కోఆర్డినేటర్, డిస్టిక్ ఎనాలసిస్ లు బి రాగిణి, కె.వి నారాయణ, జి గాయత్రీ దేవి, ఎంకే అబ్దుల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏసీవి సుబ్రహ్మణ్యం, ఎకనామిస్ట్ డాక్టర్ ముఖేష్ కుమార్, డ్వామా పిడి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24న భారత ఉపరాష్ట్రపతి ముసునూరు మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొనున్న దృశ్య ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఏలూరు ఐ జి పి జీవిజీ అశోక్ కుమార్ జిల్లా కలెక్టర్ కే వెట్రి సెల్వి జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ



**ఏలూరు బ్యూరో చీఫ్, ఆగష్టు, 20 నంది పత్రిక :** భారత ఉప రాష్ట్రపతి ఈనెల 24వ తేదీన ముసునూరు మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్న దృష్ట్యా ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను ఏలూరు ఐజిపి జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ లతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిపాడ్ ఏర్పాటు చేసే ప్రదేశం, బహిరంగ సభాస్థలి, వాహనాల కాన్వాయ్ రూట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థ ఆవరణలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భారత ఉప రాష్ట్రపతి శ్రీ సి.పి . రాధాకృష్ణన్ ఈనెల 24వ తేదీ నూజివీడు నియోజకవర్గం ముసునూరు లోని గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో నూతన పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ లు పాల్గొనే అవకాశం ఉందన్నారు. వీరితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాప్‌కార్న్ ఉత్పత్తికి కృషిచేస్తున్న రైతులు, భాగస్వాములను ఉప రాష్ట్రపతి సన్మానిస్తారన్నారు. ఉప రాష్ట్రపతి విచ్చేసే హెలిపాడ్ పనులను , రోడ్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉప రాష్ట్రపతి పర్యటించే ప్రదేశాలలో పూర్తి పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత ప్రముఖుల పర్యటన సందర్భంగా గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులతో సమన్వయము చేసుకుని ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉప రాష్ట్రపతి పర్యటించే పర్యటన లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం గౌర్మెట్ పాప్‌కార్నికా ఫ్యాక్టరీ లో వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా, డిపిఓ మల్లికార్జునరావు, ఆర్ అండ్ బి ఎస్ఈ విజయరత్నం, డిఎంహెచ్ఓ డా.శోభ, డిసిహెచ్ఎస్ బేబీ కమల, ట్రాన్స్కో ఎస్ఈ అంబేద్కర్ , ఎస్సి కార్పొరేషన్ ఈడి ఎం. ముక్కంటి, గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థ సీఈఓ వై. యుగంధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 1100 కి.మీ రహదారులకు మోక్షం కోసం - డిప్యూటీ సీఎం తో ఎమ్మెల్యే భేటీ

**చింతలపూడి అభివృద్ధిపై పవన్ తో ఎమ్మెల్యే రోషన్ చర్చ.**



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక**చింతలపూడి నియోజకవర్గ పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ని కలిశారు.గురువారం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైశాల్య పరంగా చింతలపూడి రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒకటని, నియోజకవర్గ వ్యాప్తంగా 1100 కిలోమీటర్లకు పైగా పంచాయతీరాజ్ రహదారులు ఉన్నాయని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చాలా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు.

## బార్ అసోసియేషన్‌కు జధ్యాల రవిశంకర్ ఎన్నిక

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో జంధ్యాల రవిశంకర్ ఘన విజయం సాధించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జంధ్యాల రవిశంకర్..ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసి, ఉమ్మడి ఆంధప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. గతంలో ఆంధప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్లు, గవర్నర్లకు న్యాయ సలహాదారుగా రవిశంకర్ విశేష సేవలు అందించారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. 2023 నుంచి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రవిశంకర్ పలు కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తరపున సుప్రీంకోర్టులో వాదించారు. తెలంగాణలోనూ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన పిటిషన్లలో అసెంబ్లీ స్పీకర్ తరపున జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తున్నారు.

## సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు జైలులోనే సజ్జన్ కుమార్ మృతి

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో

సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.

## 26 మిలాదున్ నబీ సెలవు

మిలాద్–ఉన్–నబి పండుగకు సంబంధించిన సెలవు తేదీని మారుస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ప్రకటించిన ఆగస్టు 25కు బదులుగా ఆగస్టు 26వ తేదీని బుధవారం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. చంద్ర దర్శనం ఆధారంగా ఈ ఏడాది మిలాద్–ఉన్–నబి పండుగ ఆగస్టు 26న వస్తుందని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి తెలియజేసింది. సెలవు తేదీని సవరించాలని వక్ఫ్ బోర్డు సీఈఓ చేసిన విజ్ఞప్తి మేరకు సెలవు తేదీని సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 26ను సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె. శ్యామల రావు అధికారికంగా జీవో జారీ చేశారు.

# "సూపర్ 6" అంటే సూపర్ హిట్

## శాసనసభలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కీలక ప్రసంగం!"

**అమరావతి బ్యూరో చీఫ్ ఆగస్టు 20 నంది పత్రిక** శాసనసభలో 'సూపర్ 6' హామీల అమలు మరియు ప్రజా సంక్షేమంపై నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య గళమెత్తారు. అసెంబ్లీలో ప్రసంగించే అవకాశం ఇచ్చినందుకు స్పీకర్ (అధ్యక్షుల వారి)కి ధన్యవాదాలు తెలియజేస్తూ ఆమె తన ప్రసంగాన్ని ప్రారంభించారు.ఎలక్షన్ల సమయంలో ప్రతిపక్షాలు "సూపర్ 6" అంటే నెరవేరని 'సూపర్ డ్రీమ్స్' (కలలు) అని ప్రచారం చేశాయని, కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే తమ అమలుతో "సూపర్ 6" అంటే "సూపర్ హిట్" అని ప్రజలే స్వయంగా నిరూపించారని ఎమ్మెల్యే సౌమ్య స్పష్టం చేశారు. కాగితాలపై హామీలు ఇవ్వడం విజయం కాదని.. ఆ హామీలు ఒక కుటుంబ జీవితంలో నిజమైన మార్పుగా మారినప్పుడే అసలైన విజయం లభిస్తుందని పేర్కొన్నారు.

**ఆమె ప్రసంగంలోని ముఖ్యమైన ముఖ్యాంశాలు:**

**తల్లికి వందనం (అమ్మ ఒడి) :**గత ప్రభుత్వంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకున్నా ఒకరికే ఆర్థిక సాయం అందించేవారని.. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' ద్వారా చదువుకు ఆర్థిక సాయం చేస్తామన్న మాటను నిలబెట్టుకుందని తెలిపారు.జులై 22న 64,76,000 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడం జరిగిందన్నారు.ప్రతి బిడ్డకు ₹15,000 కేటాయించి.. అందులో ఆ ₹13,000 నేరుగా తల్లి ఖాతాలో, ₹2,000 పాఠశాలల నిర్వహణకు కేటాయించామని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పిల్లలకు, అలాగే తల్లి లేని అనాథ పిల్లలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేసి ముఖ్యమంత్రి గారు దార్శనికత చాటుకున్నారని కొనియాడారు.

**అన్నదాత సుఖీభవ (రైతు సంక్షేమం) :**

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే (జూన్ 20న) 46 లక్షల మంది రైతు అన్నల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ' సొమ్ము జమ చేశామని తెలిపారు. విత్తనం వేసే ముందే రైతు చేతిలో డబ్బులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

**స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం :**

ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభించి ఆగస్టు 15 నాటికి ఏడాది పూర్తి చేసుకుందని తెలిపారు.ఒక్క ఏడాదిలోనే మన ఆడబిడ్డల ప్రయాణ ఖర్చుల రూపంలో ₹87 కోట్లు ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు.

ఉద్యోగాలు, కళాశాలలకు వెళ్లే మహిళలకు ప్రతినెలా ₹1,500 నుండి ₹2,000 వరకు ఆదా అవుతోందని, ఆ సొమ్మును వారి కుటుంబ అవసరాలకు, మందులకు, పుస్తకాలకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు.

**దీపం పథకం & పింఛన్ల పెంపు :** 'దీపం' పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం వల్ల పొగలేని వంట ఇల్లు ఏర్పడి, మహిళల ఆరోగ్యానికి రక్షణ లభించిందన్నారు.

సాధారణ పింఛన్‌ను ₹3,000 నుండి ₹4,000 కు, దివ్యాంగులకు ₹6,000 కు, తీవ్ర వైకల్యం ఉన్నవారికి ₹15,000 వరకు పెంచి ఆదుకుంటున్నామని తెలిపారు.

**యువతకు శ్వాసత ఉపాధి & పెట్టుబడులు :** తాత్కాలిక ఊరట కంటే యువతకు 'శాశ్వత ఉపాధి' ముఖ్యమని భావించిన సీఎం చంద్రబాబు నాయుడు .. రెండేళ్ల కాలంలో వందల కంపెనీలు, లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చారని చెప్పారు.

25 నెలల్లో 25 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. మెగా డీఎస్సీ ద్వారా 15,490 ఉపాధ్యాయ పోస్టులు, వేలాది కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు.



దేశంలోనే తొలిసారిగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**ప్రజల వద్దకే ప్రభుత్వం లెక్క చెప్పే ధైర్యం :** తమ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో 'డోర్ టు డోర్' తిరుగుతూ కేవలం 21 రోజుల్లో 61 లక్షలకు పైగా కుటుంబాలను కలిసి ఇచ్చే ప్రతి రూపాయికి లెక్క చెప్పే ధైర్యాన్ని ప్రదర్శించామని చెప్పారు.

**ముగింపు :**"ఒక ప్రభుత్వ పనితీరును కొలిచేది బడ్జెట్ అంకెలు కాదు.. ఒక తల్లి తన బిడ్డలను ధైర్యంగా చదివించగలుగుతోందా? రైతు ధైర్యంగా పెట్టుబడి పెట్టగలుగుతున్నాడా? ఆడపడుచు ఖర్చుల గురించి ఆలోచించకుండా అడుగు బయటపెడుతోందా? వృద్ధుడు ఎవరిపైనా ఆధారపడకుండా గౌరవంగా బతకగలుగుతున్నాడా? అనేదే ముఖ్యం. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మన 'సూపర్ 6'." అని ఎమ్మెల్యే సౌమ్య ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 'సూపర్ 6'ను దిగ్విజయం (సూపర్ హిట్) చేసిందని కొనియాడుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

## భార్య మృతితో కలత చెందిన భర్త అంత్యక్రియలు చేస్తుండగా గుండెపోటుతో భర్త మృతి

జిల్లాలోని ఆత్మకూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరామ్ నగర్‌లో నివాసం ఉంటున్న భార్యాభర్తలు ఒకే రోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. అనారోగ్యంతో భార్య లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలోనే భర్త సుబ్బరాయుడికి గుండెపోటు వచ్చినట్లు సమాచారం. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది. భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన సుబ్బరాయుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవడంతో విషాదం నెలకొంది. జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా నిలిచిన ఆ దంపతులు చావులోనూ తమ అనుబంధాన్ని వీడలేదంటూ స్థానికులు భావోద్వేగానికి గురవుతున్నారు. భార్య మృతితో కుటుంబంలో నెలకొన్న విషాదం నుంచి తేరుకోకముందే భర్త కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com